RNI : TGMUL/25/A1386

# తొలి అక్షరం

మా అక్షరమే - మీ అయుధంగా...

చైర్మన్& చీఫ్ ఎడిటర్ పస్తం సైదులు

www.tholiaksharam.com

ఎడిటర్: పి.సైదులు, సంపుటి : 03 సంచిక - 218 పేజీలు - 08 శనివారం 04 జులై 2026

## తొలి పలుకు

అతి తక్కువ కాలంలో అన్ని వర్గాల్లో విశేష ఆదరణ పొందుతున్న తొలి అక్షరం దినపత్రిక నిష్పక్షపాత విశ్వసనీత సమాచారంతో డిజిటల్ రంగంలో అగ్రస్థానంలోకి అడుగుపెడుతున్న తరుణంలో పాఠక మహాశయుల ఆదరాభిమానం మన్నల్ని పొందుతూ దూసుకుపోతున్న తొలి అక్షరం తెలుగు దినపత్రిక సూర్యోదయంతో పాటే పాఠకుల ముందుకు వస్తూ రాష్ట్రస్థాయిలో దేశస్థాయిలో ప్రపంచ స్థాయిలోని సమాజంలోని అన్ని రంగాల్లోని సంబంధిత అంశాలపై సమాచార వ్యాప్తిలో ముందుంటుంది. ఎప్పటికప్పుడు సమాచారాన్ని ముందు ఉంచడంలో తొలి అక్షరం దినపత్రిక అనేక మంది పాఠకుల ఆధార అభిమానాలు పొందుతుండడం విశేషంగా భావిస్తూ.. ఇదేవిధంగా పాఠకులు ఆదరాభిమానాలు ఇలాగే కొనసాగాలని ఆశిస్తూ....

- పి.సైదులు ఎడిటర్ తొలి అక్షరం దినపత్రిక

# బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా
# రూ. 8,21,651 కోట్లు

## - అనేక సంస్థలకు వేలకోట్ల బకాయిలు పెట్టిన ఘనులు

- చేసిన తప్పులను కప్పిపుచ్చుకునేందుకు డ్రామాలు
- నాటి అప్పులు, తప్పులపై కెసిఆర్ స్పందించాలి
- హరీష్ రావు అబద్దాలను కట్టిపెడితే మంచిది
- డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క స్ట్రాంగ్ వార్నంగ్



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 3:** గత కేసీఆర్ నాయకత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో చేసిన భారీ అప్పులు, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి ప్రస్తుతం లేనిపోని అబద్దాలను ప్రచారం చేస్తోందని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తీవ్రస్థాయిలో మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో చేసిన తప్పులను తక్కువ చేసి చూపించేందుకు మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ప్రయత్నిస్తున్నారని భట్టి విక్రమార్క అన్నారు. మంత్రిగా పనిచేసిన విషయాన్ని మరిచిపోయి హరీశ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. రాష్ట్ర సచివాలయంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి భట్టి విక్రమార్క మీడియాతో మాట్లాడారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిపై స్పష్టమైన లెక్కలను బయటపెట్టిన ఆయన.. గత పాలకులు రాష్ట్రంపై సుమారు రూ. 8,21,651 కోట్ల అప్పులు , బకాయిల భారాన్ని మిగిల్చారని, వాటిని ప్రస్తుత ప్రభుత్వం ఎంతో శ్రమతో క్రమబద్ధీకరిస్తోందని వెల్లడించారు. అలాగే రెసిడెన్షియల్ పాఠశాలల్లోని పిల్లలకు నాణ్యమైన భోజనం, బట్టలు , కనీస సౌకర్యాలను కల్పించడంలో గత ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని, తమ ప్రభుత్వం వచ్చాకే విద్యా సంస్థల్లోని వసతులను మెరుగుపరిచి సంక్షేమానికి పెద్దపీట వేసిందని స్పష్టం చేశారు. సింగరేణి సంస్థపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను డిప్యూటీ సీఎం తీవ్రంగా ఖండించారు. బొగ్గు గనుల కేటాయింపులు, ఉత్పత్తికి సంబంధించి మిగతా2లో...

## అమర్‌నాథ్ యాత్రికులకు
# మోడీ శుభాకాంక్షలు

- యాత్రలో పాల్గొనడం గొప్ప అనుభూతిగా వెల్లడి
- యాత్రలో జాగ్రత్తలు పాటించాలంటూ ఎక్స్ వేదికగా పిలుపు



**తొలి అక్షరం/న్యూఢిల్లీ,జూలై 3:** అమర్ నాథ్ యాత్రను పురస్కరించుకుని ప్రధాని నరేంద్ర మోదీ భక్తులకు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు. ఈ పవిత్ర యాత్రను ఒక 'గొప్ప భాగ్యం'గా అభివర్ణించిన ప్రధాని, భక్తి శ్రద్ధలతో, క్రమశిక్షణతో, బాధ్యతాయుతమైన జాతీయ భావనతో భక్తులు ఈ ప్రయాణాన్ని కొనసాగించాలని కోరారు. శివభక్తులను ఉద్దేశించి రాసిన లేఖను ఎక్స్ వేదికగా పంచుకుంటూ మోదీ పలు కీలక విషయాలను ప్రస్తావించారు.'పవిత్రమైన అమర్‌నాథ్ యాత్రలో పాల్గొనడం ఒక గొప్ప భాగ్యం. ప్రతి సంవత్సరం మంచు లింగంని నేరుగా మిగతా2లో...

# కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

## - కేంద్రమంత్రి బండి సంజయ్ ఎద్దేవా



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 3:** కాంగ్రెస్, భారాస నేతల నటన అద్భుతంగా ఉందని, బిగ్‌బాస్ షోను తలపిస్తోందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ గురువారం ఒక ప్రకటనలో ఎద్దేవా చేశారు. ప్రజలు మీ నాటకాలు చూసి నవ్వుకుంటున్నారు. అబద్దాలకు ఆస్కార్ అవార్డు ఇస్తే రెండు పార్టీలూ అర్హత సాధిస్తాయని అన్నారు. మిగతా2లో...

## అల్పపీడన ప్రభావంతో
# భారీ వర్షాలు

### - హెచ్చరించిన వాతావరణ శాఖ




**తొలి అక్షరం/విశాఖపట్టణం,జూలై 3:** ఉత్తర, పశ్చిమ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో మూడు రోజుల పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు.

మిగతా2లో...

## బిఆర్ఎస్ హయాం అప్పులపై
# తప్పుడు ప్రచారం

- తొమ్మిదిన్నరేళ్లలో తీసుకున్న రుణాలు రూ.4.17 లక్షల కోట్లే
- మంత్రి జూపల్లికు హరీష్ రావు లేఖ



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 3:** బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పులపై కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు ప్రచారం చేస్తోందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు పేర్కొన్నారు... ఈ మేరకు మంత్రి జూపల్లి కృష్ణారావుకు బహిరంగ లేఖ రాశారు. ఈ సందర్భంగా అసెంబ్లీలో చేసిన ప్రసంగాల వీడియోలు, ఆర్బీఐ గణాంకాలు సహా పలు ఆధారాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు వెల్లడించారు. హరీశ్‌రావు లేఖలో పేర్కొన్న వివరాల ప్రకారం.. బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదిన్నరేళ్ల పాలనలో తీసుకున్న రుణాలు, ప్రభుత్వ హామీతో మిగతా2లో...

# రండి అప్పులు సంగతి తేలుస్తా...

- అబద్దాలతో ప్రజలను మభ్య పెట్టలేరు
- మరోమారు హరీష్ రావుకు జూపల్లి సవాల్



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 3:** తెలంగాణ అప్పులపై మంత్రి జూపల్లి కృష్ణారావు చర్చకు మరోమారు సిద్ధమయ్యారు. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో చర్చకు సిద్ధమని.. సాయంత్రం 5 గంటలకు వస్తానని బీఆర్ఎస్ నేతలకు మరోసారి సవాల్ విసిరారు. 'మీరు సిద్ధమైతే ముందే చెప్పండి. నా లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తా. మీ లెక్కలు తప్పు అయితే రాజీనామా చేస్తారా? బీఆర్ఎస్ పార్టీని రద్దు చేస్తారా? కేసీఆర్ రాకపోతే జూపల్లి చెప్తున్న లెక్కలు తప్పని మీడియాతో చెప్పమనండి. ఖబడ్దార్.. కేసీఆర్, కేటీఆర్, హరీశ్.. పాలమూరు పౌరుషమా? కల్వకుంట్ల పౌరుషమా చూసుకుందాం' అంటూ ఛాలెంజ్ చేశారు. 'నేనెక్కడికీ పారిపోలేదు. పారిపోయే లక్షణం నాకు లేదు. నా మాటకు కట్టుబడి ఉన్నాను. ఆపరేషన్ సక్సెస్, పేషెంట్ డెడ్‌లాగా కేటీఆర్, హరీశ్ వ్యవహరిస్తున్నారు. మిగతా2లో...

## రాష్ట్రంలో అద్దం లాంటి
# రోడ్ల నిర్మాణం


- ఈ జూలై నెలలో 10 ప్యాకేజీల పనులు ప్రారంభం
- నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవు: ఆర్ అండ్ బి అధికారులతో మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 3:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో 'న భూతో న భవిష్యతి' రీతిలో రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణానికి సంకల్పించామని,అందులో భాగంగా జూన్ 28న నల్లగొండ జిల్లా కనగల్ వేదికగా ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్ర హ్యామ్ రోడ్ల పనుల పైలాన్ ఆవిష్కరణ చేసుకుని,పనులు ప్రారంభించామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పేర్కొన్నారు. మిగతా2లో...

## రైతుభరోసా
# నిధుల విడుదల

### నాలుగు రోజుల్లో రూ.6,590.37 కోట్ల జమ



**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 3:** రైతు భరోసా పథకం అమలులో తెలంగాణ ప్రభుత్వం వేగం పెంచింది. కేవలం నాలుగు రోజుల్లోనే రైతుల ఖాతాల్లో రూ.6,590.37 కోట్ల రైతు భరోసా నిధులను జమ చేసి రికార్డు సృష్టించినట్లు ప్రభుత్వం వెల్లడించింది. నేడు నాలుగో విడతలో 4 నుంచి 5 ఎకరాల భూమి ఉన్న రైతులకు రూ.1,188 కోట్ల రైతు భరోసా నిధులను విడుదల చేసింది. ఈ విడతలో

మిగతా2లో...

# మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

- అటవీ సంపద పరిరక్షణ, పచ్చదనంపై కార్యాచరణ
- ను అమలు చేయాలని నూతన పిసిసిఎఫ్ కు దిశానిర్దేశర
- మాజీ పిసిసిఎఫ్ సువర్ణను చీరతో సత్కరించిన మంత్రి

**తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 3:** రాష్ట్ర అటవీదళాల నూతన ప్రధాన సంరక్షణాధికారి (పిసిసిఎఫ్)గా బాధ్యతలు స్వీకరించిన వినయ్ కుమార్ శుక్రవారం అటవీ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖను జూబ్లిహిల్స్ లోని వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో అటవీ సంపద పరిరక్షణ, అటవీ విస్తీర్ణం పెంపు, జీవ వైవిధ్య సంరక్షణ, సామాజిక అటవీ కార్యక్రమాలు, రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న మిగతా2లో...



# అమర్‌నాథ్ యాత్రికులకు మోడీ శుభాకాంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

దర్శించుకునే ఈ అవకాశం లక్షలాది మంది శివభక్తులకు అత్యంత పవిత్రమైన, మరపురాని అనుభూతిని ఇస్తుంది. ఈ సంవత్సరం యాత్రకు సిద్ధమవుతున్న భక్తులందరికీ నా హృదయపూర్వక శుభాకాంక్షలు.' అని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. ఈ యాత్ర భారతదేశ ఆధ్యాత్మిక సంప్రదాయంలో ఒక శాశ్వతమైన అధ్యాయమని ప్రధాని కొనియాడారు. ప్రపంచ వ్యాప్తంగా సనాతన సంస్కృతిని అనుసరించే లక్షలాది మంది భక్తులు ప్రతి ఏటా బాబా అమర్‌నాథ్ ఆశీస్సుల కోసం జమ్మూ కశ్మీర్‌కు వస్తుంటారని గుర్తుచేశారు. వివిధ ప్రాంతాలు, విభిన్న భాషలు, భిన్నమైన ఆచారాలు ఉన్నప్పటికీ.. మహాదేవుని ఆశీస్సులు పొందాలనే ఒకే ఒక సంకల్పంతో భక్తులంతా ఇక్కడికి తరలివస్తారని, ఈ రెండు నెలల కాలంలో బాబా బర్ఫానీ పవిత్ర సన్నిధిలో భారతదేశ 'భిన్నత్వంలో ఏకత్వం' అనే అద్భుత దృశ్యం ఆవిష్కృతమవుతుందని మోదీ అన్నారు. ఈ యాత్ర సజావుగా సాగడానికి అహర్నిశలు శ్రమిస్తున్న భారత సైన్యం, సీఆర్‌పీఎఫ్, జమ్మూ కశ్మీర్ పోలీస్, ఐటీబీపీ, బీఎస్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్ సిబ్బందితో పాటు ఆరోగ్య కార్యకర్తలు, పరిపాలనా అధికారులు, పారిశుద్ధ్య కార్మి కులు, వాలంటీర్లకు ప్రధాని మోదీ కృతజ్ఞతలు తెలిపా రు. ఈ ఏడాది యాత్ర సందర్భంగా భక్తులందరూ తమ జీవితంలో ఐదు ముఖ్యమైన సంకల్పాలను స్వీకరించాలని ప్రధాని పిలుపునిచ్చారు. అమర్‌నాథ్ యాత్ర మార్గంలో ఎక్కడా చెత్తాచెదారం వేయకుండా, పరిశుభ్రత నియమాలను తూచా తప్పకుండా పాటించాలన్నారు. వాతావరణ మార్పులు, వర్షాల నేపథ్యంలో జారే మార్గాల పట్ల అప్రమత్తంగా ఉంటూ, పరిపాలనా యంత్రాంగం ఇచ్చే ఆదేశాలను, ట్రాఫిక్ నిబంధనలను, భద్రతా సూచనల ను పూర్తిగా అంకితభావంతో పాటించాలని సూచిం చారు. స్థానిక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసేందుకు, యాత్రికులు తమ ప్రయాణ ఖర్చులలో కనీసం 10 శాతం మొత్తాన్ని జమ్మూ కశ్మీర్‌లోని స్థానిక ఉత్పత్తుల ను కొనుగోలుకు కేటాయించాలి. ఇది అక్కడి కుటుం బాలకు, యువ తకు ఉపాధినిస్తుందన్నారు. రక్షాబంధన్ పండుగతో ముగిసే ఈ యాత్ర ముగింపు సందర్భం గా.. 'ఏక్ పేడ్ మా కే నామ్' అమ్మ పేరిట ఒక మొక్క ప్రచారం లో భాగంగా ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటాల న్నారు. దేశమే ప్రథమమనే భావనతో, మన బా ధ్యతలను ఏడాది పొడవునా నిజాయితీగా నిర్వర్తిస్తూ, 'వికసిత్ భారత్' నిర్మాణంలో చురుకైన పాత్ర పోషించా లి. చివరగా, భక్తులందరి ప్రయాణం సుఖమయంగా, సురక్షితంగా, ఆధ్యాత్మికంగా సాగాలని ప్రధాని ఆకాంక్షించారు.

# బిఆర్ఎస్ అప్పులు అక్షరాలా రూ. 8,21,651 కోట్లు

(మొదటి పేజీ తరువాయి)

గత ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యంగా వ్యవహరించి సంస్థను నష్టాల్లోకి నెట్టిందని, ప్రస్తుత ప్రభుత్వం సింగరేణిని కాపాడుకోవడానికి అన్ని రకాలుగా ప్రయత్నిస్తోందని వివరించారు. సింగరేణిలో జరిగిన గత ప్రభుత్వ కాలపు అక్రమ వ్యవహారాలపై తాము విజిలెన్స్ విచారణకు ఆదేశిస్తున్నట్లు ఈ సందర్భంగా భట్టి విక్రమార్క ప్రకటించారు. ఇప్పటికైనా ప్రతిపక్షాలు సోషల్ మీడియాలో, బయటా అబద్ధపు ప్రచారాలు చేయడం మానుకోవాలని హెచ్చరించిన ఆయన, దమ్ముంటే తమతో నేరుగా బహిరంగ చర్చకు రావాలంటూ మాజీ సీఎం కేసీఆర్‌కు సవాల్ విసిరారు.బీఆర్ఎస్ పాలనలో చేసిన అప్పులపై కేసీఆర్ స్పందించాలన్నారు. బీఆర్ఎస్ హయాంలో మొత్తం అప్పు రూ.8.21 లక్షల కోట్లు అని.. మొత్తం అప్పుల్లో గత ప్రభుత్వ బకాయిలు ఉన్నాయని తెలిపారు. అప్పులు అన్నీ వాస్తవాలు కాదా.. వీటిని ఎవరు చెల్లిస్తారని ప్రశ్నించారు. అప్పులపై కేసీఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అప్పులను తక్కువ చేసి చూపేందుకే కేటీఆర్, హరీశ్ ప్రయత్నిస్తున్నారని ఉపముఖ్యమంత్రి మండిపడ్డారు. మంత్రిగా పనిచేశానని మర్చిపోయి మరీ హరీశ్ మాట్లాడుతున్నారని.. అనేక అంశాలపై అబద్దాలు చెబుతున్నారని వ్యాఖ్యానించారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తేవాలన్నారు. బీఆర్ఎస్ నేతల అబద్దాలు ప్రజల్లోకి వెళ్లకూడదన్నారు. సోషల్ మీడియా ద్వారా అబద్ధపు ప్రచారం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అబద్దాల పునాదులపై పదేళ్లు పరిపాలించారని.. బీఆర్ఎస్ చేసిన అప్పులతో రాష్ట్రాన్ని సర్వనాశనం చేశారని విరుచుకుపడ్డారు. అప్పుల భారం రాష్ట్రంపై వేసింది నిజం కాదా అని ప్రశ్నించారు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారంటూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు. హరీశ్‌రావు అనేక విషయాలపై అబద్దాలు చెబుతున్నారు. వాస్తవాలను ప్రజల దృష్టికి తీసుకురావాలి. బీఆర్ఎస్ నేతలు చెప్పే అవాస్తవాలు ప్రజల్లోకి వెళ్లకూడదు. సోషల్ మీడియా వ్యవస్థల ద్వారా తప్పుడు ప్రచారాలు చేస్తున్నారు. అబద్దాల పునాదులపై పదేళ్లపాటు పరిపాలన చేశారు. బీఆర్ఎస్ నేతలు కావాలనే ప్రభుత్వంపై పదేపదే దుష్ప్రచారం చేస్తున్నారు. ఆ పార్టీ హయాంలో చేసిన అప్పులతో రాష్టాన్ని సర్వనాశనం చేశారు. పదేళ్లు సీఎంగా పనిచేసిన కేసీఆర్‌కు సవాల్ విసురుతున్నాం. 2014 నుంచి 2023 వరకు అప్పులు చేసి రాష్ట్రంపై పెనుభారం వేసింది నిజం కాదా? వివిధ మార్గాల ద్వారా మీరు చేసిన అప్పు రూ.8.21లక్షల కోట్లు. బుకాయింపులు, అసత్యాలతో ఎన్నాళ్లు మోసం చేస్తారు?అప్పుల అంశంపై నిత్యం మాట్లాడితే రాష్ట్రం పరువు పోతుందని తగ్గాం. మేం వచ్చాక రూ.2.08లక్షల కోట్లు చెల్లించాం. 10 శాతం వడ్డీకి కూడా మీరు అప్పులు తెచ్చారు. కట్టాల్సిన వడ్డీని రూ.34 వేల కోట్ల నుంచి రూ.11వేల కోట్లకు తగ్గించాం. బీఆర్ఎస్ నేతలు అడ్డగోలుగా మాట్లాడుతున్నారు. సింగరేణిపై ప్రతిరోజూ అబద్దాలు చెబుతున్నారు' అని భట్టి విక్రమార్క ఆగ్రహం వ్యక్తం చేశారు.

# రాష్ట్రంలో అద్దం లాంటి రోడ్ల నిర్మాణం

(మొదటి పేజీ తరువాయి)

రానున్న రెండేళ్లలో రాష్ట్రంలో ఏ మూలన చూసిన నాణ్యమైన ఆర్ అండ్ బి డబుల్ రోడ్లు వినియోగంలోకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. 'మంచి రోడ్డు - ప్రగతికి సూచిక' అని తాను బలంగా విశ్వసిస్తానని, దీంతో పల్లె పట్టణాలకు కనెక్టివిటీ పెరిగి,గ్రామీణ ప్రాంతాల్లో పరిశ్రమలు వస్తె స్థానికంగానే ఉద్యోగ,ఉపాధి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. ఆర్ అండ్ బి శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పలు పనుల పురోగతిపై డా.బి.ఆర్ అంబేద్కర్ రాష్ట్ర సెక్రటేరియట్ లో రాష్ట్ర రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి ఆ శాఖ ఉన్నతాధికారులతో సుదీర్ఘ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆర్ అండ్ బి లోని విభాగాల వారీగా పనుల పురోగతిపై కూలంకషంగా చర్చించిన మంత్రి,చేపట్టిన కీలక పనులు ఏ దశల్లో ఉన్నాయో అధికారులను ఆరా తీశారు. మొదటి ఫేజ్ లో సుమారు 13వేల కోట్లతో 6092 కి.మీ రోడ్ల పనులు 34 ప్యాకేజీల్లో రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టనుండగా..ఈ జూలై నెలలోనే 10 ప్యాకేజీల పనులు ప్రారంభం కానున్నాయని తెలిపారు. ప్యాకేజ్-2లో సుమారు 155 కోట్ల అంచనా వ్యయంతో 42కి.మీ పొడవుగల నల్లగొండ-మహబూబ్ నగర్ డబుల్ రోడ్డు పనులు ఇప్పటికే ప్రారంభమైన నేపథ్యంలో పనుల్లో వేగం పెంచాలన్నారు. ఎల్ నినో ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు ఆశించిన స్థాయిలో లేవని,అయినా.. వర్షాకాలం పూర్తి అయిన తర్వాత మూడు షిఫ్టుల్లో రోడ్ల నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని మంత్రి స్పష్టం చేశారు. రోడ్ల నిర్మాణం కోసం నిష్ణాతులై, నిరంతరం ఫీల్డ్ లో ఉండే ఇంజనీర్లను ఎంపిక చేసి,ప్యాకేజీల వారిగా పనుల బాధ్యతలు అప్పజెప్పాలని,పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేయించడం చీఫ్ ఇంజనీర్ల బాధ్యతేనని మంత్రి స్పష్టం చేశారు. ఈనెల 6న కరీంనగర్ జిల్లాలో చేపట్టే హ్యామ్, రోడ్ల పనులకు ఆ జిల్లా మంత్రులు,స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి శంకుస్థాపన చేయనున్నట్లు చెప్పారు. అందుకు సంబంధిత ఏర్పాట్లు చూడాలని సి.ఈ లు బి.వి రావు,వసంత్ నాయక్ లను మంత్రి ప్రత్యేకంగా ఆదేశించారు. ÷ూజేంద్ర నగర్ లో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న నూతన హై కోర్టు భవనం,జడ్జిల నివాస సముదాయ భవనాల నిర్మాణాలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారని,నిర్మాణ పనులు యుద్ధ ప్రాతిపదికన జరగాలని స్పష్టం చేశారు. ఇప్పటి వరకు 16 శాతం పనులు పూర్తయ్యాయని సి.ఈ లు రాజేశ్వర్ రెడ్డి, నర్సింగ్ రావు వివరించగా....మూడు షిఫ్టుల్లో నిర్మాణ పనులు జరగాలని,అందుకు అనుగుణంగా కార్మికుల సంఖ్య పెంచి, నిర్మాణ సంస్థతో సమన్వయం చేసుకుంటూ పనుల్లో వేగం పెంచాలని మంత్రి వారిని ఆదేశించారు. అక్కడ ఆర్ అండ్ బి తరుపున నిర్మాణ పర్యవేక్షణ బాధ్యతలు చూస్తున్న ఇంజనీర్ల సంఖ్యను పెంచాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ 2027 డిసెంబర్ నాటికి ప్రారంభానికి సిద్ధం చేయాలని అధికారులకు స్పష్టం చేశారు.

# మంత్రి కొండా సురేఖతో పిసిసిఎఫ్ వినయ్ కుమార్ భేటీ

(మొదటి పేజీ తరువాయి)

వన మహోత్సవం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజల భాగస్వామ్యాన్ని మరింత పెంపొందించడం, ప్రభుత్వ లక్ష్యాలు, అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలు, తదితర అంశాలపై వీరిరువురు సమగ్రంగా చర్చించారు. అటవీ సంపదను భవిష్యత్ తరాలకు అందించే బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణ, జీవవైవిధ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నదని, అటవీ శాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ విధానాలను సమర్థవంతంగా అమలు చేయాలని మంత్రి సురేఖ పిసిసిఎఫ్ కు సూచించారు. అటవీ శాఖ కార్యక్రమాల అమలులో సాంకేతికత వినియోగం, అటవీ రక్షణ చర్యల బలోపేతం, పచ్చదనం పెంపుదల, అటవీ అభివృద్ధికి సంబంధించిన కార్యాచరణను మరింత వేగవంతం చేయాలని మంత్రి వినయ్ కుమార్ కు దిశానిర్దేశర చేశారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశిరచిన లక్ష్యాల సాధనకు అటవీ శాఖ పూర్తి నిబద్ధతతో పనిచేస్తుందని పీసీసీఎఫ్ వినయ్ కుమార్ ఈ సందర్భంగా మంత్రికి హామీ ఇచ్చారు. అడవుల సంరక్షణకు అహర్నిశలు కృషి చేస్తూ, అటవీ సంపదను కాపాడుతున్న అటవీ అధికారులు, సిబ్బందికి ప్రతి ఏటా అవార్డులు, నగదు ప్రోత్సాహకాలు అందించేలా చర్యలు చేపట్టినందుకు గాను పిసిసిఎఫ్ వినయ్ కుమార్ మంత్రి సురేఖ గారికి ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ అటవీ రంగంలో ఈ చర్య మైలురాయిగా నిలుస్తుందని, అటవీ సిబ్బంది సేవలకు ప్రభుత్వం ఇస్తున్న గౌరవానికి ఇది నిదర్శనమని ఆయన అన్నారు. పదవీ విరమణ తర్వాత తనను మర్యాదపూర్వకంగా కలిసిన మాజీ పిసిసిఎఫ్ సువర్ణను మంత్రి కొండా సురేఖ చీరతో సత్కరించి, అభినందించారు. అటవీ శాఖకు ఆమె అందించిన విశిష్ట సేవలను కొనియాడారు. పదవీవిరమానంతర జీవితం సంతోషంగా గడపాలని ఆకాంక్షించారు.

# అల్పపీడన ప్రభావంతో భారీ వర్షాలు

(మొదటి పేజీ తరువాయి)

ఉమ్మడి ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, ఖమ్మం జిల్లాల్లో భారీ వర్ష కురిసే అవకాశం ఉందని, దక్షిణ, మధ్య తెలంగాణ జిల్లాల్లో తేలిక నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని పేర్కొన్నారు. వాయవ్య బంగాళాఖాతాన్ని ఆనుకొని ఉన్న ఉత్తర ఒడిశా, పశ్చిమ బెంగాల్ తీర ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడిందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇది రాబోయే రెండు, మూడు రోజుల్లో మరింత బలపడే అవకాశం ఉందన్నారు. గంటకు 40-50 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. శుక్రవారం మేఘావృతమైన వాతావరణంతో శ్రీకాకుళం, పోలవరం, కోనసీమ, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లో పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మిగిలిన జిల్లాల్లో అక్కడక్కడా తేలికపాటి నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించారు.

# ఘోర రోడ్డు ప్రమాదం.. 40 మంది మృతి

తొలి అక్షరం/ఇస్లామాబాద్,జూలై 3:పరిమితికి మించి ప్రయాణికులతో వెళ్తున్న ఓ బస్సు.. లోయలో పడిపోయింది. ఈ ప్రమాదంలో 40 మంది ప్రయాణికులు మరణించారు. మరో ఎనిమిది మంది తీవ్రంగా గాయపడ్డారు. పాకిస్థాన్ బలూచిస్థాన్ రాష్ట్రంలో షేరానీ జిల్లాలో శుక్రవారం తెల్లవారుజామున ఈ ప్రమాదం జరిగింది. సమాచారం అందుకున్న షేరానీ జిల్లా ఉన్నతాధికారులు, వైద్యులు, పోలీసులు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. క్షతగాత్రులను అత్యవసర చికిత్స కోసం ఝోబ్‌లోని ట్రామా సెంటర్‌కు తరలించారు. వారిలో పలువురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. మృతదేహాలను పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఇటీవల జరిగిన అత్యంత ఘోర రోడ్డు ప్రమాదాల్లో ఇదీ కూడా ఒకటని అధికారులు తెలిపారు. సాంకేతిక లోపంతో ఓ బస్సు ఆగిపోయిందని, దీంతో అందులోని ప్రయాణికులను కూడా ఈ బస్సులోకి ఎక్కించారని అధికారులు చెప్పారు. దీంతో బస్సు ప్రయాణికులతో నిండిపోయిందన్నారు. ఈ ప్రమాదం జరిగిన బస్సు.. 36 మంది ప్రయాణికులతో క్వెట్టా నుంచి బయలుదేరిందని పేర్కొన్నారు. ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు ప్రారంభమైందని పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు.

# కాంగ్రెస్, బిఆర్ఎస్ నేతల నటన అద్భుతం

(మొదటి పేజీ తరువాయి)

గురుకులాల టెండర్లు, తెలంగాణ అప్పులతోపాటు అవినీతి, అక్రమాలపైనా చర్చిద్దాం రండి. మా పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు ఆధ్వర్యంలో తేదీ, సమయం, వేదిక నిర్ణయిస్తాం. కాంగ్రెస్, భారాస పాలనా వైఫల్యాలను ప్రజల ముందుంచేందుకు మేం సిద్ధం. మోదీ ప్రభుత్వం తెలంగాణ అభివృద్ధికి ఖర్చు చేసిన నిధులు, అందించిన సంక్షేమ కార్యక్రమాలపైనా చర్చిద్దాం. తెలంగాణలోనూ డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని సంజయ్ అన్నారు.

# బిఆర్ఎస్ హయాం అప్పులపై తప్పుడు ప్రచారం

(మొదటి పేజీ తరువాయి)

తీసుకున్న రుణాలు కలిపి మొత్తం రూ.4.17 లక్షల కోట్లేనని అసెంబ్లీలో వివరించినట్లు తెలిపారు. ఆ లెక్కలపై ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు సిద్ధమని అప్పుడే ప్రకటించానని గుర్తు చేశారు. అలాగే, కాంగ్రెస్ ప్రభుత్వం 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రూ.1,77,058 కోట్ల అప్పు చేసినట్లు మంత్రి జూపల్లి తన లేఖలో పేర్కొన్నారని తెలిపారు. అయితే, రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గణాంకాల ప్రకారం 2026 జూన్ 30 నాటికి రాష్ట్ర ప్రభుత్వం చేసిన అప్పు రూ.1,86, 067 కోట్లుగా ఉందని హరీశ్‌రావు పేర్కొన్నారు. మరోవైపు, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్వయంగా ప్రభుత్వం చేసిన ఎఫ్ఆర్‌బీఎం, ఇతర అన్ని రకాల రుణాలు కలిపి రూ.3,47,294 కోట్లుగా ప్రకటించారని ఆయన గుర్తు చేశారు. బీఆర్ఎస్ తమ లెక్కలను మార్చడం లేదని, కాంగ్రెస్ మాత్రం సందర్భానుసారంగా అప్పుల అంకెలను మారుస్తోందని విమర్శించారు. తమ అంచనాల ప్రకారం వివిధ మార్గాల ద్వారా ప్రస్తుత ప్రభుత్వం సుమారు రూ.4.5 లక్షల కోట్ల అప్పులు చేసిందని హరీశ్‌రావు ఆరోపించారు. ఈ అంశానికి సంబంధించిన అసెంబ్లీ వీడియోలు, ముఖ్యమంత్రి చేసిన ప్రకటనలు, ఆర్బీఐ అధికారిక గణాంకాలను మంత్రి జూపల్లి వాట్సాప్‌కు పంపినట్లు తెలిపారు. వాటిని పరిశీలించి వాస్తవాలను తెలుసుకోవాలని కోరిన హరీశ్ రావు,అప్పుల అంశంలో తప్పుడు ప్రచారం మానుకోవాలని కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు.

# రండి అప్పులు సంగతి తేలుస్తా...

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర అప్పు రూ.3,17,015 కోట్ల అని ఒకసారి, రూ.3,85,045 కోట్లు అని మరోసారి అసెంబ్లీలో కేటీఆర్ అన్నారు. రాష్ట్ర అప్పు రూ.4, 26,499 కోట్లు అని ఒకసారి.. రూ.4,17, 496 కోట్లు అని మరోసారి హరీశ్ అసెంబ్లీలో అన్నారు. కేసీఆర్ దిగిపోయే సరికి రూ.8,21, 651 కోట్ల అప్పు ఉంది. నేను చెప్తున్న లెక్కలు తప్పు అయితే మంత్రి పదవికి, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేస్తానని తాజాగా సవాల్ చేశారు. కార్పొరేషన్ ద్వారా తెచ్చిన అప్పులను కేటీఆర్, హరీశ్ ఎందుకు చెప్పడం లేదు. మిషన్ భగీరథ కోసం తెచ్చిన అప్పులు ప్రజలు కడతారా?' అంటూ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. అబద్దాలు చెప్పే వాడిని కాదని మంత్రి తెలిపారు. ఆత్మ గౌరవం కోసం ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేశానని గుర్తుచేశారు. ఉద్యోగానికి రాజీనామా చేసి వ్యవసాయం చేసుకునే వాడినని తెలిపారు. రాజకీయాల నుంచి వ్యాపారంలోకి రాలేదని.. వ్యాపారం చేసి రాజకీయాల్లోకి వచ్చినట్లు జూపల్లి కృష్ణారావు వెల్లడించారు.

# రైతుభరోసా నిధుల విడుదల

(మొదటి పేజీ తరువాయి)

4.41 లక్షల మంది రైతులు లబ్ది పొందినట్లు ప్రభుత్వం పేర్కొంది. ఇప్పటివరకు మొత్తం 65.76 లక్షల మంది రైతుల ఖాతాల్లో రైతు భరోసా సాయం జమ చేసినట్లు అధికారులు వెల్లడించారు. మిగిలిన అర్హులైన రైతులకు కూడా దశలవారీగా నిధులు విడుదల చేస్తామని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రైతులకు ఇచ్చిన హామీని ప్రభుత్వం నిలబెట్టుకుందని అన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతు భరోసా నిధులు నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామని మంత్రి తెలిపారు.

# ఉస్మానియా వైద్యుల అరుదైన చికిత్స

## అవయవ మార్పిడిలో రికార్డు సృష్టి

## వైద్యులను సన్మినించిన మంత్రి దామోదర

తొలి అక్షరం/హైదరాబాద్,జూలై 3: నగరంలోని ఉస్మానియా ఆస్పత్రిలో 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా పూర్తి చేశారు. దీంతో వైద్యులను వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర నరసింహ ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 'తెలంగాణ రాష్ట్ర వైద్య రంగంలో సరికొత్త అధ్యాయం లిఖించబడింది. దేశ వైద్య చరిత్రలోనే అత్యంత అరుదైన ఘనతను ఉస్మానియా ప్రభుత్వ ఆస్పత్రి సొంతం చేసుకుంది. అవయవదానం అనేది మహాదానం, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది.' అని అన్నారు. ఉస్మాని యా ప్రభుత్వ ఆస్పత్రిలో తొలిసారిగా 5 అవయవాల మార్పిడి శస్త్రచికిత్సను వైద్యులు అత్యంత విజయవంతంగా పూర్తి చేశారు. సుమారు 36 గంటల పాటు ఎంతో క్లిష్టంగా సాగిన ఈ శస్త్రచి కిత్సను విజయవంతం చేసిన డాక్టర్ మధుసూదన్ నేతృత్వంలోని వైద్య బృందాన్ని వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ సచివాలయంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యుల ప్రతిభను, వారి



అంకితభావాన్ని మంత్రి ప్రత్యేకంగా అభినందించారు. అవయవదానం అనేది మహాదాన మని, ఈ సందేశాన్ని సమాజంలోకి మరింత విస్తృతంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఆయన ఈ సందర్భంగా పిలుపుని చ్చారు. రాష్ట్రంలో ప్రభుత్వ ఆస్పత్రులను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం గట్టి సంకల్పంతో పనిచేస్తోందని మంత్రి దామోదర స్పష్టం చేశారు. ఇందులో భాగంగానే వైద్య రంగ బలోపేతానికి పెద్దపీట వేస్తూ గత రెండున్నరేళ్ల కాలంలోనే 15 వేల ఉద్యోగాలను భర్తీ చేశామని వెల్లడించారు. అంతేకా కుండా, తాజాగా మరో 6,238 పోస్టుల భర్తీకి ప్రభుత్వం ఆమోదం తెలిపిం దన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అత్యాధునిక వైద్య సదుపాయాలను నిరంతరం విస్తరిస్తున్నామని, ఉస్మానియా వైద్యుల ఘనతతో తెలంగాణ వైద్య రంగానికి జాతీయ స్థాయిలో గొప్ప గుర్తింపు లభించిందని మంత్రి దామోదర్ రాజనర్సింహ హర్షం వ్యక్తం చేశారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులచే ఏఐ శిక్షణ




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 3:** తెలంగాణ విద్యాశాఖ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న అన్న అక్క ఏఐ మెంటార్ షిప్ కార్యక్రమాలు శుక్రవారం తొర్రూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.రాములు మార్గదర్శకత్వంలో జడ్పీహెచ్ఎస్ పాఠశాలలు ప్రారంభించారు. ఈ ప్రోగ్రాంలో శిక్షణ తీసుకున్న డిగ్రీ కళాశాల విద్యార్థులు పాఠశాల విద్యార్థులకు ఏఐ ,మిషన్ లెర్నింగ్ మరియు కోడింగ్ వంటి అంశాలను బోధించారు. ఈ సందర్భంగా జడ్పీహెచ్ఎస్ తొర్రూరు ప్రధానోపాధ్యాయులు జెల్లా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఈ కార్యక్రమం ద్వారా అనేక సాంకేతిక నైపుణ్యాలను పెంచుటతోపాటు ఉపాధ్యాయులపై ఉన్న ఒత్తిడి కొంతవరకు తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నోడల్ ఆఫీసర్స్ రవీంద్రారెడ్డి,ఎస్.శ్రీనివాస్, డాక్టర్ సునీల్, విద్యార్థులు, అధ్యాపకులు, జడ్పిహెచ్ఎస్ భౌతిక శాస్త్ర ఉపాధ్యాయులు చంద్రమౌళి పాల్గొన్నారు.

# క్షేత్రస్థాయిలో సమస్యల పరిశీలన

- త్వరితగతిన మరమ్మతులు చేపట్టాలి
- ప్రజల భద్రతకే మా ప్రథమ ప్రాధాన్యత
- తొర్రూర్ మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్
- తొర్రూర్ పట్టణంలో మున్సిపల్ చైర్మన్ విస్తృత పర్యటన
- పగిలిన డివైడర్లు, విద్యుత్ స్తంభాలు, నాళాల పరిశీలన
- అధికారులకు క్షేత్రస్థాయి ఆదేశాలు... పాల్గొన్న తొర్రూర్ కమిషనర్ వి శ్యాంసుందర్







**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 3:** తొర్రూర్ పట్టణ ప్రజల భద్రతకు, మెరుగైన మౌలిక వసతుల కల్పనకు మున్సిపాలిటీ అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని తొర్రూరు మున్సిపల్ చైర్మన్ తూనం శ్రవణ్ కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం ఆయన తొర్రూర్ పట్టణంలోని పలు వార్డుల్లో, ప్రధాన రహదారుల్లో మున్సిపల్ అధికారులతో కలిసి విస్తృతంగా పర్యటించారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను, రహదారుల పరిస్థితిని ఆయన స్వయంగా అడిగి తెలుసుకున్నారు. పర్యటనలో భాగంగా పట్టణంలోని పగిలిన రహదారి డివైడర్లు, ప్రమాదకరంగా మారిన విద్యుత్ స్తంభాలు, దెబ్బతిన్న రోడ్లను చైర్మన్ పరిశీలించారు. వర్షాల దృష్ట్యా నాళాలు (డ్రైనేజీలు) ఉప్పొంగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. వాహనదారులకు, కాలినడకన వెళ్లే ప్రజలకు ఎలాంటి ప్రమాదాలు కలగకుండా రోడ్ సేఫ్టీ చర్యలు తక్షణమే చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఎక్కడికక్కడ దెబ్బతిన్న వసతులకు తక్షణమే మరమ్మతు పనులు ప్రారంభించి, వేగంగా పూర్తి చేయాలని సూచించారు. ప్రజలకు సురక్షితమైన ప్రయాణాన్ని అందించడం, పరిశుభ్రమైన వాతావరణాన్ని నెలకొల్పడం మా బాధ్యత. మెరుగైన మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా తొర్రూర్ మున్సిపాలిటీ నిరంతరం శ్రమిస్తుంది. పనుల్లో అలసత్వాన్ని సహించేది లేదు. పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దేందుకు మున్సిపల్ యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని చైర్మన్ పేర్కొన్నారు. మున్సిపల్ కమిషనర్ వి శ్యాంసుందర్, మున్సిపల్ ఇంజనీరింగ్, శానిటేషన్ సిబ్బందితో పాటు స్థానిక వార్డు కౌన్సిలర్లు, ప్రజలు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా 'అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం'

- లయన్స్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ కందకట్ల సోమశేఖర్, క్లబ్ ప్రెసిడెంట్




**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జూలై 3:** ప్లాస్టిక్ రహిత సమాజమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ ముందుకు సాగాలని లయన్స్ క్లబ్ చార్టెడ్ ప్రెసిడెంట్ కందకట్ల సోమశేఖర్, క్లబ్ ప్రెసిడెంట్ వనం మోహన్ పిలుపునిచ్చారు. 'అంతర్జాతీయ ప్లాస్టిక్ రహిత దినోత్సవం' సందర్భంగా లయన్స్ క్లబ్ తొర్రూర్ వినాయక ఫ్రెండ్స్ ఆధ్వర్యంలో, క్లబ్ అధ్యక్షులు వనం మోహన్ అధ్యక్షతన స్థానిక తొర్రూర్ లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన చార్టెడ్ ప్రెసిడెంట్ కందకట్ల సోమశేఖర్, స్థానిక ఎల్ వై ఆర్ గార్డెన్ రోడ్‌లో ప్రజలకు ప్లాస్టిక్ రహిత జ్యూట్ (జనపనార) బ్యాగులను పంపిణీ చేశారు. మనం నిత్యం చేసే పనులలో ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించాలి. ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా కాగితపు సంచులను, పర్యావరణానికి మేలు చేసే జ్యూట్ బ్యాగులను వాడటం అలవాటు చేసుకోవాలి. వారు స్థానిక కిరాణా షాపుల యజమానులతో మాట్లాడి, ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని నిలిపివేయాలని విజ్ఞప్తి చేశారు. ప్లాస్టిక్ వల్ల పర్యావరణానికి, మానవ ఆరోగ్యానికి కలిగే దుష్ప్రయోజనాలను ఈ సందర్భంగా వారికి వివరించి అవగాహన కల్పించారు. ఈ పర్యావరణ హిత కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పాల్గొన్న వారిలో. లయన్ పారిపల్లి శ్రావణ్ కుమార్ క్లబ్ ప్రధాన కార్యదర్శి, లయన్ పద్మం యాదగిరి క్లబ్ పూర్వాధ్యక్షులు,లయన్ తల్లాడి హీరాధర్‌లయన్ ఆడెపు స్వామి,తదితర లయన్స్ క్లబ్ సభ్యులు, స్థానిక ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.


# అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి: శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జులై 3:** ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని శాసనసభ్యులు వైద్యులు భూక్యా మురళి నాయక్ సూచించారు. శుక్రవారం మండలంలోని వి.ఎస్ లక్ష్మీపురం,సింగారం , హాజరియతండా గ్రామాలకు సంబంధిన దీూూ,దీూూ లతో వి.ఎస్ లక్ష్మీపురం గ్రామం లో చేపట్టిన 'ప్రత్యేక ఓటరు జాబితా సవరణ' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా శాస సభ్యులు స్థానిక బీఎల్‌వోలు (దీూూం) ఇతర అధికారులతో కలిసి ఓటరు జాబితా సవరణ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు జరుగుతున్న ఈ ఓటరు జాబితా సవరణ ప్రక్రియను అధికారులు అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఎటువంటి పొరపాట్లకు తావులేకుండా అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చూడాలని ఆదేశించారు. 18 ఏళ్లు నిండిన యువత, కొత్తగా పెళ్లి చేసుకుని వచ్చిన వారు, వలస వచ్చిన వారు తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని కోరారు. తప్పులు ఉన్నట్లయితే సరిదిద్దుకోవడానికి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటరు జాబితా సవరణపై అవగాహన కల్పించాలని, ఫారాలను సకాలంలో పంపిణీ చేసి, పూర్తి వివరాలను సేకరించాలని సూచించారు. ఏదైనా సందేహాలు ఉన్న పక్షంలో స్థానిక తహసీల్దార్ కార్యాలయాలన్నీ సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ హాస్పిటల్ ,మెడికల్ కాలేజీ అడ్వైసర్ కమిటీ సభ్యులు దేవరం ప్రకాష్ రెడ్డి,కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు మిట్టకంటి రాంరెడ్డి, వి ఎస్ లక్ష్మీపురం సర్పంచ్ మీసా ల నిర్మల వెంకన్న, ఉప సర్పంచ్ పుణ్యపుర్తి ఐలయ్య, సర్పంచ్ జరుపుల భార్గవి రవి ఉమ్మడి గ్రామాల బీఎల్‌వోలు, బి ఎల్ ఏ లు,పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రూ.4.17 లక్షల ప్రజాధనం మాయం..?

- ఫిర్యాదులపై ఎందుకు మౌనం అధికారులు.. సమగ్ర విచారణ ఎప్పుడంటూ ప్రశ్నలు!
- ఎంపీడీవో, కలెక్టర్‌కు ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమని మాజీ సర్పంచ్ చంద్రారెడ్డి ఆవేదన
- గ్రామ పంచాయతీ సిబ్బంది ఖాతాల్లోకి నిధులు వెళ్లాయంటూ తీవ్ర ఆరోపణలు
- ప్రజాధనం కాపాడాల్సిన బాధ్యత అధికారులదే.. వెంటనే విచారణ జరిపి నిజాలు వెలికితీయాలని డిమాండ్



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో సాంబ జులై 3:** మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురు మండల కేంద్రంలోని సీతారాంపురం గ్రామ పంచాయతీలో రూ.4 లక్షల 17 వేల ప్రజాధనం దుర్వినియోగం జరిగిందంటూ మాజీ సర్పంచ్ బోడుగం సోమేశ్వరి చంద్రారెడ్డి చేసిన ఆరోపణలు తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంపై ఇప్పటికే ఎంపీడీవో కార్యాలయంలో లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసిన ఆయన, అనంతరం జిల్లా కలెక్టర్ నిర్వహించిన సోమవారం గ్రీవెన్స్‌లో కూడా పూర్తి ఆధారాలతో ఫిర్యాదు సమర్పించినట్లు తెలిపారు. ఫిర్యాదు అనంతరం ఒక అధికారి గ్రామానికి వచ్చి గ్రామ పంచాయతీ రికార్డులను పరిశీలిస్తామని చెప్పారని, కానీ అసలు ఆరోపణలకు సంబంధించిన లావాదేవీలపై లోతైన విచారణ చేపట్టలేదని చంద్రారెడ్డి ఆరోపించారు. గ్రామ పంచాయతీ సిబ్బంది ఖాతాల్లోకి నిధులు జమ అయినట్లు సమాచారం, ఆధారాలు ఉన్నప్పటికీ వాటిని పరిశీలించకుండా వ్యవహరిస్తున్నారని ఆయన అన్నారు. ఈ సందర్భంగా చంద్రారెడ్డి మాట్లాడుతూ, "ఇది చంద్రారెడ్డి డబ్బు కాదు... ఇది సీతారాంపురం గ్రామ ప్రజల సొమ్ము. పేదల అభివృద్ధి కోసం ప్రభుత్వం విడుదల చేసిన ప్రతి రూపాయి ప్రజల హక్కు. అలాంటి ప్రజాధనం దుర్వినియోగం జరిగిందని ఫిర్యాదు చేస్తే అధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారు? నిజాయితీగా పనిచేస్తే విచారణకు భయమెందుకు? తప్పు చేయకపోతే వాస్తవాలు బయటకు రావడానికి ఎవరు అడ్డం? ఆధారాలతో ఫిర్యాదు చేసిన తర్వాత కూడా చర్యలు లేకపోవడం ప్రజల్లో అనుమానాలకు తావిస్తోంది. వెంటనే పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులను గుర్తించి చట్టప్రకారం చర్యలు తీసుకోవాలి. లేదంటే ప్రజలు న్యాయం కోసం మరింత పెద్ద స్థాయిలో పోరాటం చేయాల్సి వస్తుంది" అని తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

# తెలంగాణ సాయుధ పోరాట యోధుడు తాను నాయక్ ఆశయాలు చిరస్మరణీయం...

- తాను నాయక్ విగ్రహావిష్కరణకు గిరిజనులు, ఉద్యమకారులు సహకరించాలి జాటోత్ సురేష్ నాయక్...



**తొలి అక్షరం/రాష్ట్ర బ్యూరో తొర్రూర్ ప్రతినిధి (సాంబ పస్తం) జులై 3:** తెలంగాణ సాయుధ పోరాటంలో భూమి, భుక్తి, వెట్టిచాకిరి విముక్తి కోసం అణగారిన వర్గాలను, ముఖ్యంగా గిరిజనులను చైతన్యపరుస్తూ పోరాడిన అమరవీరుడు తాను నాయక్ త్యాగాలు, పోరాట స్ఫూర్తి నేటి తరానికి ఆదర్శప్రాయమని తొర్రూరు మండల గిరిజన నాయకుడు జాటోత్ సురేష్ నాయక్ అన్నారు. ఆయన శుక్రవారం తొర్రూర్ లోనీ ఓ ప్రకటనలో ఆయన మాట్లాడుతూ.. ప్రజల హక్కుల సాధన, సామాజిక న్యాయం, సమానత్వం కోసం ప్రాణాలను సైతం లెక్కచేయకుండా పోరాడిన మహనీయుల్లో తాను నాయక్ ఒకరని పేర్కొన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో గిరిజనుల హక్కుల కోసం ఆయన చేసిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఇలాంటి మహనీయుల చరిత్రను భావితరాలకు పరిచయం చేయడం సమాజ బాధ్యత అని, యువత వారి జీవితాలను ఆదర్శంగా తీసుకొని సామాజిక చైతన్యంతో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. తెలంగాణ విమోచన పోరాటంలో గిరిజన యోధుల పాత్రను చరిత్రలో మరింతగా నిలబెట్టే ఉద్దేశంతో పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, టీపీసీసీ ఉపాధ్యక్షురాలు హనుమాండ్ల ఝాన్సీ రెడ్డి సహకారంతో తొర్రూరులో తాను నాయక్ విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గిరిజన సంఘాల ప్రతినిధులు, మేధావులు, ఉద్యమకారులు, ప్రజాప్రతినిధులు, యువత, ప్రజాసంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని సహకరించాలని జాటోత్ సురేష్ నాయక్ కోరారు. తాను నాయక్ ఆశయాలు సమాజంలో స్ఫూర్తిని నింపుతూ, సామాజిక న్యాయం కోసం జరిగే ఉద్యమాలకు మార్గదర్శకంగా నిలుస్తాయని ఆయన పేర్కొన్నారు...

# మార్కండేయ స్వామి ప్యానెల్ అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

- బడుగు మోహన్ బాబు శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానెల్ అధ్యక్ష అభ్యర్థి

**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 3:** చేనేత సహకార సంఘం ఎన్నికల్లో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానెల్‌కు మద్దతుగా బడుగు మోహన్ బాబు ప్రచారం 9 మంది అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని విజ్ఞప్తి చౌటుప్పల్ చేనేత సహకార సంఘం ఎన్నికల నేపథ్యంలో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానెల్ అభ్యర్థులకు మద్దతుగా ఆ ప్యానెల్ అధ్యక్ష అభ్యర్థి బడుగు మోహన్ బాబు విస్తృత ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, చేనేత కార్మికుల సంక్షేమం, సహకార సంఘం అభివృద్ధి, పారదర్శక పాలన, సభ్యుల సమస్యల పరిష్కారమే తమ ప్రధాన లక్ష్యమని తెలిపారు. చేనేత కార్మికుల హక్కుల పరిరక్షణతో పాటు సంఘాన్ని మరింత అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రానున్న ఎన్నికల్లో శ్రీ శివ భక్త మార్కండేయ స్వామి ప్యానెల్‌కు చెందిన మొత్తం 9 మంది అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించాలని చేనేత సహకార సంఘ సభ్యులను బడుగు మోహన్ బాబు కోరారు. ప్రతి సభ్యుడు తమ అమూల్యమైన ఓటును ప్యానెల్ అభ్యర్థులకు వేసి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ ప్రచార కార్యక్రమంలో ప్యానెల్‌కు చెందిన అభ్యర్థులు, చేనేత సంఘ నాయకులు, సభ్యులు, మద్దతుదారులు మరియు పలువురు ప్రముఖులు పాల్గొని విజయానికి తమ సంపూర్ణ సహకారం అందిస్తామని తెలిపారు.



# రెడ్డిబావి అభివృద్ధికి ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ అండ

**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 3:** విద్య, వైద్యం, ఉపాధి ప్రతి ఒక్కరికీ అందించడమే ఇ.ఎల్.వి. భాస్కర్ ఫౌండేషన్ ధ్యేయమని ఫౌండేషన్ చైర్మన్ ఇరుగదిండ్ల భాస్కర్ అన్నారు. శుక్రవారం మండలంలోని రెడ్డిబావి గ్రామాన్ని ఆయన సందర్శించగా గ్రామ ప్రజలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ నందగిరి వెంకటేష్ ఆయనను శాలువాతో సన్మానించారు. అనంతరం గ్రామ ప్రజలతో సమావేశమైన భాస్కర్ మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి, ప్రజల సంక్షేమమే లక్ష్యంగా ఫౌండేషన్ పనిచేస్తోందని తెలిపారు. రెడ్డిబావి గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణ కోసం త్వరలోనే సొంత నిధులతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రామీణ మహిళల స్వయం ఉపాధి కోసం ఉచిత టైలరింగ్ శిక్షణ కేంద్రం ప్రారంభిస్తామని, శిక్షణ



పూర్తిచేసుకున్న మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తామని చెప్పారు. అనారోగ్య సమస్యలతో బాధపడేవారు కార్పొరేట్ ఆసుపత్రుల్లో అధిక ఖర్చులు చేసి అప్పులపాలు కాకుండా, ఫౌండేషన్‌ను సంప్రదిస్తే మెరుగైన వైద్య సేవలు



అందేలా సహకరిస్తామని తెలిపారు. గ్రామంలో ఉన్న మౌలిక వసతుల సమస్యలను తమ దృష్టికి తీసుకురావాలని, వాటి పరిష్కారానికి ఫౌండేషన్ తరపున కృషి చేస్తామని భాస్కర్ పేర్కొన్నారు.

# యాసంగి వరి బోనస్‌పై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్

**• రైతులకు వెంటనే బకాయిలు చెల్లించాలి: ఢిల్లి మాధవ రెడ్డి**



**తొలి అక్షరం/చౌటుప్పల్, జూలై 3:** యాసంగి సీజన్ ముగిసినా రైతులకు ఇస్తామని ప్రకటించిన వరి బోనస్‌ను కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికీ చెల్లించకపోవడం రైతులను మోసం చేసినట్లేనని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఢిల్లి మాధవ రెడ్డి విమర్శించారు. గత యాసంగి సీజన్‌కు సంబంధించి రైతులకు ఇవ్వాల్సిన రూ.1,159 కోట్ల వరి బోనస్‌ను ప్రభుత్వం ఇప్పటికీ విడుదల చేయలేదని అన్నారు. అలాగే ఈ యాసంగి సీజన్‌లో కూడా సుమారు రూ.700 కోట్ల బోనస్‌ను నిలిపివేసి రైతులను తీవ్ర నిరాశకు గురిచేసిందని ఆరోపించారు. అన్నదాతల సంక్షేమమే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎన్నికల సమయంలో హామీలు ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం, అధికారంలోకి వచ్చిన తర్వాత రైతుల సమస్యలను పూర్తిగా విస్మరించిందని ఆయన మండిపడ్డారు. రైతులకు రావాల్సిన ప్రోత్సాహకాలను ఆలస్యం చేయకుండా వెంటనే విడుదల చేసి ఇచ్చిన హామీలను అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఈ సమయంలో ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించి, పెండింగ్‌లో ఉన్న వరి బోనస్ మొత్తాన్ని వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలని ఢిల్లి మాధవ రెడ్డి కోరారు.

# తాపీ మేస్త్రీలకు గిట్టుబాటు ధర కల్పించాలి: సంఘం డిమాండ్

**షాద్‌నగర్‌లో తాపీ మేస్త్రీల ర్యాలీ.. కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వ చర్యలు కోరుతూ వినతి**

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** తాపీ మేస్త్రీలకు గిట్టుబాటు ధర కల్పించాలని, భవన నిర్మాణ కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కోరుతూ రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలో తాపీ మేస్త్రీల సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. బ్లాక్ ఆఫీస్ కార్యాలయం నుంచి ప్రధాన చౌరస్తా వరకు జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు యాదయ్య, ప్రధాన కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తి మాట్లాడుతూ, ఎన్నో సంవత్సరాలుగా తాపీ మేస్త్రీలు, భవన నిర్మాణ కార్మికులు ప్రమాదకర పరిస్థితుల్లో



పనిచేస్తున్నారని తెలిపారు. విధి నిర్వహణలో భాగంగా భవనాలపై నుంచి కిందపడి పలువురు కార్మికులు ప్రాణాలు కోల్పోగా, మరికొందరు శాశ్వత అంగవైకల్యానికి గురయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తగిన న్యాయం, పరిహారం



అందేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని కోరారు. అదే విధంగా తాపీ మేస్త్రీలకు గిట్టుబాటు కూలి రేట్లు అమలు చేయాలని, నిర్మాణ రంగ కార్మికుల శ్రమకు తగిన గుర్తింపు, భద్రత, సంక్షేమ పథకాలు అందుబాటులోకి తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వెంటనే పరిష్కరించాలని సంఘం నాయకులు విజ్ఞప్తి చేశారు.

# ఒకే అనుమతితో మూడు స్కూళ్లు

**• ట్రినిటీ ఎదుట అఖిలపక్ష ధర్నా, నాయకుల అరెస్ట్**




**తొలి అక్షరం/చౌటుప్పల్ జులై 3:** చౌటుప్పల్ పట్టణంలోని ట్రినిటీ స్కూల్ ఒకే ప్రభుత్వ అనుమతితో మూడు పాఠశాలలను నిర్వహిస్తూ విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని ఆరోపిస్తూ అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల ఆధ్వర్యంలో ఈరోజు భారీ ధర్నా నిర్వహించారు. అక్రమంగా నడుస్తున్న విద్యాసంస్థలపై తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నాయకులు నిరసన తెలిపారు. ధర్నా సందర్భంగా నాయకులు ప్రభుత్వ విద్యా శాఖ నిర్లక్ష్యాన్ని విమర్శిస్తూ, నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై సమగ్ర విచారణ చేపట్టి కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. శాంతియుతంగా కొనసాగుతున్న ధర్నాను పోలీసులు అడ్డుకుని పలువురు నాయకులు, కార్యకర్తలను అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అధికారులు వెంటనే స్పందించి ట్రినిటీ స్కూల్‌తో పాటు మండలంలోని అన్ని ప్రైవేట్ పాఠశాలల అనుమతులు, గుర్తింపు, మౌలిక వసతులు, ఫీజుల వ్యవహారంపై విచారణ చేపట్టాలని, లేదంటే ఉద్యమాన్ని జిల్లా, రాష్ట్ర స్థాయికి విస్తరిస్తామని అఖిలపక్ష విద్యార్థి, యువజన సంఘాల నాయకులు హెచ్చరించారు.

# విద్యా వ్యాపారం చేస్తున్న డాన్ బాస్కో పాఠశాలపై, నిర్లక్ష్యంగా వ్యవహరించిన విద్యాధికారులపై చర్య తీసుకోవాలి

**ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు**

**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** విద్యా వ్యాపారాన్ని పెంచి పోషిస్తు ప్రయివేటు విద్యా సంస్థలతో కుమ్మక్కయిన విద్యాధికారులను వెంటనే సస్పెండ్ చేయాలని, విద్యను వ్యాపారంగా మార్చి నిబంధనలు విరుద్ధంగా పాఠ్యపుస్తకాలను సామాగ్రిని విక్రయిస్తున్న డాన్ బాస్కో పాఠశాలపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు వేముల నాగరాజు డిమాండ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా డాన్ బాస్కో పాఠశాలలో ఇష్టారాజ్యంగా విద్యార్థులకు పుస్తకాలు సామాగ్రి విక్రయిస్తుండగా రెడ్ హ్యాండెడ్ గా పట్టుకొని అనంతరం మండల విద్యాధికారులకు సమాచారం ఇవ్వగా రాజకీయ పలుకుబడితో వచ్చి చూసి చూడనట్లు వ్యవహరించి వెళ్లిపోగా జిల్లా విద్యాధికారి బిక్షపతి కి సమాచారం ఇవ్వగా నేను వస్తున్నాను అక్కడే



ఉండండి అంటూ నిర్లక్ష్యంగా వ్యవహరించాలని విద్యార్థులు తల్లిదండ్రులను విద్యా వ్యాపారం పేరుతో దోచుకు తింటుంటే ఎవరు మాట్లాడతారని ప్రశ్నించారు. విద్యా వ్యవస్థను కాపాడాల్సిన విద్యాధికారులే ప్రైవేట్ విద్యా సంస్థలతో లాలూచీపడి కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని వెంటనే ఇట్టి విషయంపై సమగ్ర విచారణ జరిపి పాఠశాల యాజమాన్యం పై మండల జిల్లా విద్యాధికారులపై




చర్య తీసుకోవాలని మండలంలో జరిగే ఫీజుల దోపిడీ, విద్యా వ్యాపారాన్ని అరికట్టాలని డిమాండ్ చేశారు డాన్ బాస్కో పాఠశాల పై చర్య తీసుకోకుంటే పోరాట ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల కార్యదర్శి పుట్టల ఉదయ్ కుమార్, మండల నాయకులు తుర్కపల్లి లోకేష్, యాదాసు కార్తీక్ ముక్కిడి ప్రవీణ్ నవదీప్ తదితరులు పాల్గొన్నారు

# గ్రీన్ ల్యాండ్‌ను అభివృద్ధి చేయాలి: నర్రా సంధ్య శ్రావణ్



**తొలి అక్షరం/మహబూబాబాద్ బ్యూరో జూలై 3:** గ్రీన్ ల్యాండ్ ను అభివృద్ధి చేసి, అన్యాక్రాంతం కాకుండా చూడాలని వార్డ్ కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్ కోరారు. పురపాలక సంఘ పరిధిలోని 25 వ వార్డు లోని నందమూరి నగర్ లో గ్రీన్ ల్యాండ్ ను అభివృద్ధి చేయాలని శుక్రవారం మున్సిపల్ కమీషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా 25 వ వార్డు కౌన్సిలర్ నర్రా సంధ్య శ్రావణ్ మాట్లాడుతూ 25 వ వార్డు పరిధి లోని నందమూరి నగర్ లో గ్రీన్ ల్యాండ్ ఉందని గ్రీన్ ల్యాండ్ ను సంరక్షించాలని అన్నారు. సరైన హద్దులతో కూడిన ఫెన్సింగ్ లేక అన్యాక్రాంతమయ్యే అవకాశం ఉందని అన్నారు. అట్టి గ్రీన్ ల్యాండ్ లో చిల్డ్రన్ పార్క్, గ్రీనరీ పచ్చదనం కోసం చెట్లు నాటి ఆహ్లాదకరమైన అందమైన పార్కు ఏర్పాటు కోసం నిధులు కేటాయించాలని కోరారు. 25 వార్డు పట్టణానికి శివారులో ఉండటం వలన అభివృద్ధికి ఆమడ దూరం లో ఉందని అన్నారు ఇటీవల శాసన సభ్యులు డావ మురళీనాయక్ 50 లక్షలతో రోడ్లు, డ్రైన్ లకు శంకుస్థాపన చేసి ఆరు ఏడు నెలలు అయినా ఇంత వరకు పనులు ప్రారంభం కాలేదు అన్నారు. వెంటనే రూ.. 50 లక్షల పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. త్వరలో అభివృద్ధి పనులు ప్రారంభం కాకపోతే దశలవారీగా ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. సానుకూలంగా స్పందించిన కమీషనర్ వినోద్ త్వరలోనే పనులు ప్రారంభించడానికి ప్రయత్నం చేస్తున్నామని హామీ ఇవ్వడం జరిగింది. వినతి పత్రం సమర్పించిన వారిలో 25 వ వార్డు సిపిఐ కమిటి సభ్యులు మంద శంకర్ ,తండా శ్రీనాథ్ తదితరులు ఉన్నారు.

# జిల్లేడు చౌదర్‌గూడ మండల కేంద్రంలోనే పోలీస్‌స్టేషన్ నిర్మించాలి: జేఏసీ డిమాండ్

**షాద్‌నగర్ ఆర్డీఓకు వినతిపత్రం.. ప్రజాభిప్రాయంతోనే తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి**

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** రంగారెడ్డి జిల్లా జిల్లేడు చౌదర్‌గూడ మండల కేంద్రంలోనే పోలీస్‌స్టేషన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) నాయకులు శుక్రవారం షాద్‌నగర్ ఆర్డీఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మండల కేంద్రానికి బదులుగా లాల్పహాడ్‌లో పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలనే ప్రతిపాదనను ప్రభుత్వం పునఃపరిశీలించాలని వారు కోరారు. ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ, జిల్లేడు చౌదర్‌గూడకు చారిత్రక ప్రాధాన్యం ఉందని, గతంలో సంస్థాన కేంద్రంగా గుర్తింపు పొందిందని తెలిపారు. ప్రస్తుతం ఈ ప్రాంతం వ్యాపార కేంద్రంగా అభివృద్ధి చెందిందని, మార్కెట్, బ్యాంకులు, విద్యాసంస్థలు, ప్రభుత్వ కార్యాలయాలు వంటి కీలక సేవలు మండల కేంద్రంలోనే అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పోలీస్‌స్టేషన్‌ను వేరే ప్రాంతంలో ఏర్పాటు చేయడం వల్ల ప్రజలు అనవసర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేశారు.



మండల కేంద్రంలో పోలీస్‌స్టేషన్ ఉంటే ప్రజలకు అత్యవసర సమయంలో త్వరితగతిన పోలీసు సేవలు అందుతాయని, శాంతిభద్రతల పరిరక్షణ మరింత సమర్థవంతంగా జరుగుతుందని తెలిపారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా తీసుకునే నిర్ణయాలు మండల అభివృద్ధిపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉందని పేర్కొంటూ, పోలీస్‌స్టేషన్ ఏర్పాటుకు ముందు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించి, ప్రజల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని తుది నిర్ణయం తీసుకోవాలని అధికారులను జేఏసీ నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో మచ్చ సుధాకర్‌రావు, సయ్యద్ హాఫీజ్ భాయ్, పడకంటి వెంకటేష్, ఎదిర రాజు, వర్కల శివరాజు, బోయ అశోక్‌తో పాటు జేఏసీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు

# వలిగొండ తొర్రూరు హైవేలపై వివిధ గ్రామాల చౌరస్తాలు నిర్మాణం చేయాలి

**• తెలంగాణ క్రాంతి దళ్ యాదాద్రి భువనగిరి జిల్లా అధ్యక్షులు.**

**• ప్రధాన కార్యదర్శి ఇంజమూరి రామన్న, జక్కల మత్స్యగిరి**

**తొలి అక్షరం/వలిగొండ జులై 03:** వలిగొండ తొర్రూర్ రహదారుల అత్యంత ప్రమాదకరంగా మారి హైవేల పై వస్తున్న వాహనాలు మితిమీరిన వేగంతో ప్రయాణం చేస్తూ వివిధ గ్రామాల మధ్య ఎటువంటి యూటర్న్ యూటర్న్ సదుపాయం ప్రమాద హెచ్చరిక బోర్డులు లేకపోవడం వలన ఎదురుగా వచ్చే వాహనాలు డీ కొట్టుకుని చాలామంది ప్రజలు ప్రమాద బారి నుండి మృత్యువాత పడుతున్నారు మరియు తీవ్రంగా క్షతగాత్రులు అవుతున్నారు కావున రోడ్డు ప్రమాదాలు నివారించాలంటే వివిధ గ్రామాల కూడలిలో అండర్ ప్రాసిక్ ను ఏర్పాటు చేసి ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేసి వాహన వేగ పరిమితులను నిర్ణయించాలి వాహనదారుల ప్రమాదాలను అరికట్టాలి, దమనబోయిన పాండు, గండు మల్లేష్, జక్కుల లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.



## భక్త పోతన" నాటకంలో ఆంజనేయ పాత్రధారి వడ్ల రమేశ్ చారికి ఘన సత్కారం



**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** వనస్థలిపురంలో నిర్వహించిన "భక్త పోతన" పౌరాణిక పద్యనాటకం విజయవంతంగా ముగిసింది. ఈ సందర్భంగా నాటకంలో ఆంజనేయస్వామి పాత్రను అద్భుతంగా పోషించి ప్రేక్షకుల ప్రశంసలు అందుకున్న కళాకారుడు వడ్ల రమేశ్ చారిని నాటక ప్రదర్శన అనంతరం వనస్థలిపురం శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఘనంగా సత్కరించారు. రమేశ్ చారి తన హావభావాలు, పద్యాల ఉచ్చారణ, భావప్రకటనతో ఆంజనేయస్వామి పాత్రకు జీవం పోశారని పలువురు కళాప్రముఖులు కొనియాడారు. ఆయన కళాప్రతిభను అభినందిస్తూ భవిష్యత్తులో మరిన్ని పౌరాణిక నాటకాలలో నటించి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాటక నిర్వాహకులు, కళాకారులు, కళాభిమానులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని వడ్ల రమేశ్ చారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## షాద్‌నగర్ చౌరస్తా రోడ్డు విస్తరణకు బీసీ సేన వినతి

### ట్రాఫిక్ సమస్య పరిష్కారానికి చౌరస్తా విస్తరణ చేపట్టాలని డిమాండ్

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** షాద్ నగర్ పట్టణంలోని ప్రధాన చౌరస్తా రోడ్డు విస్తరణ పనులను త్వరితగతిన ప్రారంభించాలని కోరుతూ జాతీయ బీసీ సేన నాయకులు శుక్రవారం ఆర్డీవో ఎన్.ఆర్. సరిత, తహసీల్దార్ నాగయ్య, ఆర్ అండ్ బీ శాఖ సహాయ ఇంజనీర్ (ఏఈ), మున్సిపల్ కమిషనర్ సునీత, మున్సిపల్ చైర్మన్ అగ్గనూరు బస్వంలకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా జాతీయ బీసీ సేన రాష్ట్ర అధ్యక్షులు వరప్రసాద్ మాట్లాడుతూ, షాద్‌నగర్ ప్రధాన చౌరస్తాలో రోజురోజుకూ ట్రాఫిక్ రద్దీ పెరిగిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రమాదాలను నివారించి ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించేందుకు ప్రభుత్వం తక్షణమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని కోరారు. వినతిపత్రాన్ని స్వీకరించిన అధికారులు చౌరస్తా విస్తరణకు సంబంధించిన అంశాలను సమగ్రంగా పరిశీలించి, ప్రభుత్వ అనుమతులు మరియు అవసరమైన ప్రక్రియలు పూర్తయిన వెంటనే పనులు ప్రారంభించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి ప్యాట జయ శ్రీకాంత్, రంగారెడ్డి సోషల్ మీడియా అధ్యక్షులు గిరిబాబు, చేవెళ్ల నియోజకవర్గ అధ్యక్షులు శ్రీనివాస్ గౌడ్, షాద్‌నగర్ టౌన్ అధ్యక్షురాలు కే. సరస్వతి తదితరులు పాల్గొన్నారు



## జీవో 641 రద్దు చేసే వరకు డంపింగ్ యార్డ్ వ్యతిరేక ఉద్యమం ఆగదు: మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

### • సిద్దాపూర్ డంపింగ్ యార్డ్‌పై బీఆర్ఎస్ కార్యాచరణ ప్రారంభం

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** సిద్దాపూర్ గ్రామంలో జీహెచ్ఎంసీ ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రం (డంపింగ్ యార్డ్) ఏర్పాటు కోసం ప్రభుత్వం జారీ చేసిన జీవో నం. 641పై భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించేందుకు ఈరోజు షాద్‌నగర్‌లోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ఆధ్వర్యంలో సిద్దాపూర్, పరిసర గ్రామాల నాయకులు, ప్రజాప్రతినిధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ ఏర్పాటుతో సిద్దాపూర్‌తో పాటు పరిసర గ్రామాల ప్రజల ఆరోగ్యం, పర్యావరణం, వ్యవసాయం, భూగర్భ జలాలు తీవ్రంగా దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా ప్రభుత్వం జీవో నం. 641ను జారీ చేయడం ప్రజావ్యతిరేక నిర్ణయమని విమర్శించారు. డంపింగ్ యార్డ్ జీవోను ప్రభుత్వం వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ, జీవో 641 ఉపసంహరించుకునే వరకు ప్రజలతో కలిసి అన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. గ్రామాల వారీగా ప్రజలను చైతన్యపరుస్తూ, అవసరమైతే భారీ నిరసన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. సిద్దాపూర్ ప్రజల న్యాయమైన పోరాటానికి బీఆర్ఎస్ పార్టీ అన్ని విధాలుగా అండగా ఉంటుందని, ప్రజల హక్కుల పరిరక్షణ కోసం చివరి వరకు పోరాడతామని మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో మాజీ జడ్పీ వైస్ చైర్మన్ ఈట గణేష్, మాజీ జడ్పీటీసీ శ్రీలత సత్యనారాయణ, మాజీ మండల పార్టీ అధ్యక్షులు మెండే కృష్ణ, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ నటరాజన్, సర్పంచ్ వెంకటయ్య, మాజీ సర్పంచులు వడ్డె బాలయ్య, రమేష్, చంద్రశేఖర్ తదితరులు, ఆయా గ్రామాల, తండాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## పిర్జాపూర్‌లో నూతన గ్రామపంచాయతీ భవనానికి భూమిపూజ

### • ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో గ్రామాభివృద్ధికి శ్రీకారం ఎన్. చంద్రశేఖర్




**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** జిల్లేడు చౌదరిగూడ మండలంలోని పిర్జాపూర్ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ (ఉపాధి హామీ) నిధులతో నిర్మించనున్న నూతన గ్రామపంచాయతీ భవనానికి శుక్రవారం ఘనంగా భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు, గ్రామ సర్పంచ్ ఎన్. చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా పాల్గొని నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎన్. చంద్రశేఖర్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు మెరుగైన పరిపాలన, పారదర్శక సేవలు అందించేందుకు ప్రభుత్వం ఆధునిక సౌకర్యాలతో గ్రామపంచాయతీ భవనాల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గ్రామ స్వరాజ్యాన్ని బలోపేతం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. గ్రామాభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు ప్రభుత్వ సేవలను మరింత చేరువ చేయడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. నూతన గ్రామపంచాయతీ భవనం పూర్తయిన అనంతరం ప్రజలకు అన్ని పరిపాలనా సేవలు ఒకేచోట అందుబాటులోకి వస్తాయని, గ్రామ అభివృద్ధి కార్యక్రమాల అమలు మరింత సమర్థవంతంగా జరుగుతుందని ఆయన చెప్పారు. గ్రామ ప్రజల సహకారంతో అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు నర్సింలు, బంధయ్య, మాజీ సర్పంచులు బాలరాజు, నర్సింలు, పాపయ్య, మాజీ ఎంపీటీసీ సత్యనారాయణ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వెంకట నర్సింహారెడ్డి, ఆంజనేయులు, నవీన్, కాంగ్రెస్ నాయకులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## యాదాద్రి ట్రస్ట్ బోర్డులో జిల్లా వాసులకు స్థానం ఎక్కడ?

### మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య



**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** రామన్నపేట మండల కేంద్రంలో మాజీ శాసనసభ్యులు చిరుమర్తి లింగయ్య ఏర్పాటుచేసిన పత్రిక సమావేశంలో మాట్లాడుతూ 2023 డిసెంబర్ నుంచి 2026 జూన్ వరకు రాష్ట్ర ప్రభుత్వం ఎఫ్ఆర్బీఎం (ఖీ=దీవీ) కింద రూ.1,86,087 కోట్ల అప్పు తీసుకువచ్చిందని అధికారిక లెక్కలు చెబుతున్నాయని, అయితే మంత్రి తనకు రాసిన లేఖలో మాత్రం రూ.1,77,058 కోట్లుగా పేర్కొన్నారని అన్నారు. ఈ రెండు లెక్కల మధ్య ఉన్న దాదాపు రూ.10 వేల కోట్ల వ్యత్యాసంపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే, 2026 మార్చి 18న అసెంబ్లీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ తమ ప్రభుత్వం 27 నెలల్లో రూ.3,47,294 కోట్ల అప్పు చేసిందని ప్రకటించారని గుర్తు చేశారు. మరోవైపు మంత్రి జూపల్లి కృష్ణారావు వేరే లెక్కలు చెబుతున్నారని పేర్కొంటూ, ముఖ్యమంత్రి చెప్పింది నిజమా? లేక మంత్రి చెప్పింది నిజమా? అని ప్రశ్నించారు. ఈ అంశంపై మంత్రి జూపల్లి కృష్ణారావు చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ, తాను చేసిన సవాళ్ల నేపథ్యంలో రాజీనామా చేయాల్సింది ఎవరో ప్రజలకు స్పష్టత ఇవ్వాలని అన్నారు. అసెంబ్లీలో ప్రభుత్వం చేసిన ఆరోపణలకు తాము సమాధానం ఇచ్చామని, బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అప్పు రూ.4 లక్షల కోట్లేనని ఆధారాలతో నిరూపించామని తెలిపారు. అలాగే, కాగ్ నివేదికలో కూడా బీఆర్ఎస్ ప్రభుత్వ అప్పు రూ.4.15 లక్షల కోట్లుగా నమోదైందని పేర్కొంటూ, తాము చెప్పిన లెక్కలు, కాగ్ నివేదికలోని వివరాలు ఒకే విధంగా ఉన్నాయని అన్నారు. వాస్తవాలను వక్రీకరిస్తూ ప్రభుత్వం గోబెల్స్ ప్రచారం చేస్తోందని విమర్శించారు. యాదాద్రి ట్రస్ట్ బోర్డ్ లో నల్గొండ జిల్లా లో ఒక్కరికి కూడా స్థానం కల్పించకపోవడం అత్యంత విచారకరమని, ఇది నల్గొండ జిల్లా ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే చర్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు పోష బోయిన. మల్లేశం ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాస్ విక్రమ్ మాజీ ఎంపీటీసీలు వేమవరం. సుధీర్ బాబు పున్న. వెంకటేశం ఎండి. ఆమెర్ టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కన్నెబోయిన బలరాం బత్తుల. వెంకటేశం జాడ. సంతోష్ నక్క. నరేందర్ తదితరులు పాల్గొన్నారు

## వివాహ వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** ఈరోజు రామన్నపేట మండలంలోని జనం పెల్లి గ్రామంలో మేడబోయిన మహేష్ వివా వ రిసెప్షన్ వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేసిన మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ఈ కార్యక్రమంలో మాజీ మండల అధ్యక్షులు పోష బోయిన. మల్లేశం ఇంద్రపాలనగరం సర్పంచ్ గర్దాసు విక్రం మాజీ ఎంపీటీసీ వేమవరం సుధీర్ బాబు మాజీ సర్పంచ్ రేఖ యాదయ్య టిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు కన్నెబోయిన. బలరాం నక్క. నరేందర్ నల్ల .సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవోకి ఆహ్వాన పత్రిక అందజేత



**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** జులై 5న భువనగిరి ప్రభుత్వ జూనియర్ కాలేజీలో సాయంత్రం 4. 30 నిమిషాలకు జరిగేరాజ్యాధికార సమరభేరి చలో భువనగిరి సభకు సంబంధించిన ఆహ్వాన పత్రికను తెలంగాణ రాజ్యాధికార పార్టీ రామన్నపేట మండల అధ్యక్షులు కళ్లెం ఉపేందర్ రామన్నపేట స్థానిక ఎంపీడీవో రాములు కి అందజేసి ఈ విధంగా సమరభేరి సభ లక్ష్యాలు, సామాజిక న్యాయం, రాజ్యాధికారం సాధన, బీసీఎస్సీఎస్టీమైనారిటీల ఐక్యతపై వివరించారు.

## సంకష్టహర చతుర్థి సందర్భంగా వినాయక గంజ్ గణపతి ఆలయంలో ఘనంగా ప్రత్యేక పూజలు



### గణపతి దేవాలయంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ పాల్గొని భక్తులతో కలిసి అర్చనలు

**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ పట్టణంలోని వినాయక గంజ్ 20వ వార్డులో ఉన్న గణపతి దేవాలయంలో నిజ జ్యేష్ఠ మాస సంకష్టహర చతుర్థి సందర్భంగా శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సాయి మిత్ర యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు మలగారి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్ ముఖ్య అతిథిగా హాజరై స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం శివాలయంలో కూడా ప్రత్యేక అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఏసీపీ లక్ష్మీనారాయణ, పట్టణ సీఐ సీతారాం కూడా పూజల్లో పాల్గొని స్వామివారి ఆశీర్వాదం పొందారు. అనంతరం సాయి మిత్ర యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్‌ను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో భాగంగా భక్తులకు అన్నదానం నిర్వహించగా భగవాన్ దాస్ మాలాని, అజయ్ కంకణి అన్నదానానికి సహకారం అందించారు. ఈ కార్యక్రమంలో షాద్‌నగర్ పట్టణ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గంధం ఆనంద్ కుమార్, వన్నాడ వెంకటేష్ గౌడ్, 12వ వార్డు కౌన్సిలర్ కళ్యాణ్ కార్ దిలీప్ కుమార్, 20వ వార్డు కౌన్సిలర్ పినమోని గోపాల్, 2వ వార్డు కౌన్సిలర్ నరేష్, ఏ. అభిలాష్, సంతోష్, శేఖర్ రెడ్డిరాధా దంపతులు, బిక్కుమల్ల ప్రవీణ్‌గీతారాణి దంపతులు, వెంకట్ రెడ్డి, కోటిలింగం గౌడ్, అంతటి శ్రీనివాస్ గౌడ్, గజవాడ నరసింహులు, ఉప్పల సత్యం, ఆర్ఐ వెంకట్ రెడ్డి, పోకల శ్రీశైలం, శ్రీధర్, కత్తి శ్రావణ్ సాయి, భరత్, మహావీర్, ఆలయ ట్రస్ట్ సభ్యులు శంకర్‌లాల్ లాహోటి, చేగన్‌లాల్, కాకునూరి వెంకటేష్ గుప్తా, గోవింద్, విష్ణు సహస్రనామ మండలి సభ్యులు, ఆలయ పూజారులు పండిట్ రాజన్ శాస్త్రి, విష్ణు శాస్త్రి, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు - 2 భూ బాధిత

# రైతులకు ఊరట..

**ఎకరానికి రూ.40 లక్షలు, హెచ్ఎండిఏ పరిధిలో ఒక ప్లాటు**

**రైతుల తరపున ప్రభుత్వంతో మూడు గంటలపాటు చర్చలు జరిపిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**

**జిల్లా కలెక్టర్ నారాయణ రెడ్డి సమక్షంలో కుదిరిన కీలక ఒప్పందం**

**షాద్‌నగర్ రైతుల సమస్యల పరిష్కారానికి వారధిగా నిలిచిన ఎమ్మెల్యేకు రైతుల కృతజ్ఞతలు**





**తొలి అక్షరం/షాద్ నగర్, జులై 03:** తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపడుతున్న గ్రీన్ ఫీల్డ్ రేడియల్ రోడ్డు2 నిర్మాణానికి సంబంధించి షాద్ నగర్ నియోజక వర్గంలో భూములు కోల్పోతున్న రైతులకు ఊరటనిచ్చే కీలక నిర్ణయం వెలువడింది. షాద్‌నగర్ నియోజకవర్గంలోని చుక్కమెట్టు, ముటుపూరు, ఉమ్మెంతాల, లాలాపేట, తుమ్మలపల్లి, లచ్చంపేట గ్రామాల మీదుగా రోడ్డు నిర్మాణం చేపట్టనున్న నేపథ్యంలో భూములు కోల్పోతున్న రైతులకు తగిన నష్టపరిహారం కల్పించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో కీలక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ రైతుల తరపున అధికారులతో విస్తృతంగా చర్చలు జరిపారు. గతంలో అధికారులు ఆయా గ్రామాల్లో సర్వేలు నిర్వహించి, భూ సర్వే నంబర్లను ప్రకటించడంతో రైతుల్లో ఆందోళన నెలకొంది. ఈ నేపథ్యంలో రైతులు ఎమ్మెల్యేను కలిసి తమ సమస్యలను వివరించగా, రైతుల కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి ప్రభుత్వంతో చర్చలు జరిపిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అందుకు అనుగుణంగా జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, షాద్‌నగర్ ఆర్డీఓ సరిత తదితర అధికారుల సమక్షంలో రైతులతో కలిసి సుమారు మూడు గంటలపాటు సుదీర్ఘంగా చర్చలు నిర్వహించారు. రైతుల అభిప్రాయాలు, ప్రభుత్వ నిబంధనలను పరిగణనలోకి తీసుకుని ఎకరానికి రూ. 40 లక్షల నష్టపరిహారంతో పాటు హెచ్ఎండిఏ పరిధిలో ఒక ప్లాటు కేటాయించే విధంగా అంగీకారానికి వచ్చినట్లు వెల్లడించారు. ఈ నిర్ణయంతో భూములు కోల్పోతున్న రైతుల్లో ఆనందం వ్యక్తమైంది. రైతుల పక్షాన నిలబడి ప్రభుత్వంతో చర్చలు జరిపి మెరుగైన నష్టపరిహారం సాధించిపెట్టిన ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు. గతంలో ఏ ప్రజాప్రతినిధి కూడా ఈ స్థాయిలో రైతుల తరపున అధికారులతో చర్చలు జరపలేదని వారు పేర్కొన్నారు. ఈ సమావేశంలో రంగారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, షాద్‌నగర్ ఆర్డీఓ సరిత, జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షులు తుమ్మలపల్లి జితేందర్ రెడ్డి, కొందుర్గు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కొవ్వూరి పురుషోత్తం రెడ్డి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు కృష్ణారెడ్డి, ఆయా గ్రామాల సర్పంచులు, మాజీ సర్పంచులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో

# ఉచిత దంత వైద్య శిబిరం





**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** కామినేని దంత వైద్యశాల, నార్కట్పల్లి వారి సహకారంతో మునిపంపుల భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత దంత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరాన్ని గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత ప్రజలు ఇలాంటి ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకుని దంత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ఆరోగ్య పరిరక్షణ కోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. గ్రామ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందించిన కామినేని దంత వైద్యశాల వైద్యులు, సిబ్బందికి ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ శిబిరంలో దంత వైద్యులు రోగులను పరీక్షించి అవసరమైన వైద్య సలహాలు, చికిత్సలు అందించారు. పెద్ద సంఖ్యలో గ్రామ ప్రజలు శిబిరానికి హాజరై దంత పరీక్షలు చేయించుకుని వైద్య సేవలను పొందారు. ఈ కార్యక్రమంలో కామినేని దంత వైద్యశాల పిఆర్ఓ చంద్రశేఖర్,డా. శృతి,డా. రామాసాయి చరణ్,డా. మణికంఠ,డా. హసీత రాజ్,డా. దూబే దీప్తి, డా. అమూల్య రెడ్డి,భగత్ సింగ్ విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు తాళ్లపల్లి జితేందర్,గంటెపాక శివ కుమార్, బూడిద బిక్షం, ఉంద్రాతి నర్సింహా,జంపాల ఉమాపతి, హేమలత,సంధ్య,ఉమ,గ్రామ ప్రముఖులు, వైద్య సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

## చిన్నారిని ఆశీర్వదించిన దైద రవీందర్



**తొలి అక్షరం/రామన్నపేట జులై 3:** నకిరేకల్ మండలం చందుపట్ల గ్రామానికి చెందిన కలుకూరి సాయిరాం దీప్తిల కుమారుని మొదటి జన్మదిన వేడుకలు పాల్గొని చిన్నారిని ఆశీర్వదించిన. దైద రవీందర్ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# పాఠశాలకు డ్యూయల్ డెస్క్‌ల విరాళం







**తొలి అక్షరం/కల్లూరు, జులై 3 :** ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేసిన తోపుడు బండి ఫౌండేషన్ వ్యవస్థాపకులు స్వర్గీయ సాధిక్ అలీ 63వ జయంతిని పురస్కరించుకుని, ఆయన సతీమణి ఉషా కల్లూరు పట్టణంలోని శాంతినగర్ ప్రభుత్వ పాఠశాలకు 15 డ్యూయల్ డెస్క్‌లను బహుమానంగా అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు బి. రత్న మాధురి అధ్యక్షతన ముఖ్య అతిథిగా హాజరైన మండల విద్యాశాఖ అధికారి పి. పద్మ మాట్లాడుతూ, సాధిక్ అలీ ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం తుదిశ్వాస వరకు నిరంతరం కృషి చేశారని, ముఖ్యంగా బాలికల ఉన్నత పాఠశాల అభివృద్ధికి అందించిన సహకారం ప్రశంసనీయమని పేర్కొన్నారు. కల్లూరు ఏఎంసి చైర్మన్ నీరజ ప్రభాకర్ మాట్లాడుతూ, సాధిక్ అలీ ఆశయాలను కొనసాగిస్తూ ఆయన సతీమణి ఉషా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లడం అభినందనీయమని అన్నారు. విద్యార్థులు కూడా సాధిక్ అలీ సేవా భావాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజానికి ఉపయోగపడేలా ఎదగాలని ఆకాంక్షించారు. పురపాలక సంఘ చైర్మన్ ధరావత్ మోహన్ మాట్లాడుతూ సాధిక్ అలీ తో తనకు ఉన్న స్నేహబంధాన్ని గుర్తు చేసుకుంటూ, ఆయన అకాల మరణం బాధాకరమని పేర్కొన్నారు. ఆర్యవైశ్య జిల్లా మహాసభ అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు మాట్లాడుతూ కరోనా కాలం నుంచి సాధిక్ అలీ కల్లూరు మండలంలోని పేద విద్యార్థులకు ఆర్థిక, నైతిక పరంగా అండగా నిలిచి వారికి భరోసా కల్పించారని కొనియాడారు. ఈ సందర్భంగా ఉషా మాట్లాడుతూ, సాధిక్ అలీ నాణ్యమైన విద్య ప్రతి విద్యార్థికి అందాలనే లక్ష్యంతో నిరంతరం పనిచేశారని తెలిపారు. మండలంలోని పాఠశాలలను సందర్శిస్తూ వాటి అవసరాలను గుర్తించి సహాయం అందించేందుకు ఎల్లప్పుడూ ముందుండేవారని చెప్పారు. ఆయన ఆశయాలకు అనుగుణంగా విద్యార్థుల సంక్షేమం కోసం తాను కూడా సేవా కార్యక్రమాలను కొనసాగిస్తానని తెలిపారు. ఇప్పటికే పెనుబల్లి మండలంలోని రామచంద్రరావుబంజర గ్రామ పాఠశాలకు, అలాగే కల్లూరు పాఠశాలకు కూడా తన వంతు సహాయం అందించినట్లు పేర్కొన్నారు. సాధిక్ అలీ 63వ జయంతి సందర్భంగా కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేసి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అనంతరం పురపాలక సంఘ పెద్దలు, శాంతినగర్ పెద్దలు కలిసి ఉషా దాతృత్వాన్ని ప్రశంసిస్తూ ఆమెను సన్మానించారు. పాఠశాలకు వుడెన్ ర్యాక్ అందించిన కంటిపూడి మేరమ్మ ను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కౌన్సిలర్ ఖమ్మంపాటి రాధా వీరయ్య, టిపిసిసి ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీటీసీ కొండూరు కిరణ్ కుమార్, మాజీ వార్డు సభ్యుడు కొత్తపల్లి వెంకటేశ్వర్లు, కల్లూరు మండల యుటీఎఫ్ అధ్యక్షులు రాయల్ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి కె. విజయ్ కుమార్, గుర్రాల సత్యానందం, కె.వి., కల్లూరు మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు ఉస్మాన్, సహోపాధ్యాయులు గుర్రాల సుధీర్ కుమార్, కిషోర్ దత్త, గద్దల సమాధానం, ఖమ్మంపాటి జయమ్మ, కంటిపూడి మేరమ్మ, కోలేటి సంతోషం, రావూరి కుమారి, తదితరులు పాల్గొన్నారు.

## మహిళా సంక్షేమం, సాధికారతకు

# కేంద్రం పెద్దపీట : బండి

**• మహిళల స్వావలంభనే సర్కార్ ధ్యేయం : డాక్టర్ కవ్వంపల్లి**



**తొలి అక్షరం/కరీంనగర్ జూలై 03:** మహిళా సంక్షేమం, ఆర్థికాభివృద్ధి సాధికారతకు మోదీ ప్రభుత్వం పెద్దపీట వేస్తున్నదని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ చెప్పారు. శుక్రవారం ఎల్ఎండీ కాలనీలోని మహిళా ప్రాంగణంలో కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ మహిళా సంక్షేమానికి కేంద్రం పాటుపడుతోందని, ఉజ్వల పథకంలో భాగంగా 11 కోట్ల గ్యాస్ కనెక్షన్లు మహిళలకు ఇచ్చామని చెప్పారు. త్వరలో మహిళలకు 35 శాతం రిజర్వేషన్లు తీసుకు వస్తామన్నారు. స్వయం ఉపాధి అవకాశాల కల్పనలో భాగంగా మహిళలకు విడుతల వారీగా ఆటోలు ఇప్పించే ప్రయత్నం చేస్తున్నట్టు కేంద్ర మంత్రి చెప్పారు. గూడ్స్ ఆటోలు మన కరీంనగర్ లో మాత్రమే నడుస్తున్నాయని, వీటికి మరింత డిమాండ్ పెరిగే అవకాశాలున్నాయన్నారు. అన్నిరంగాల్లో మహిళలను ప్రోత్సహించే దిశగా ముందుకు సాగుతున్నామన్నారు. ఏ ప్రభుత్వమైనా ప్రజలకు మంచి చేయాలని చూస్తుందని, అయితే గత పాలకులు మాత్రం ఇందుకు భిన్నంగా పని చేశారని, గత పాలకులకు మహిళలను ప్రోత్సహించాలన్న సోయి లేకుండా పోయిందన్నారు. కరీంనగర్ పార్లమెంట్ పరిధిలో 20 వేల మంది విద్యార్థులకు సైకిళ్లు కొని ఇవ్వడమే కాకుండా పదో తరగతి చదివిన విద్యార్థులకు పరీక్ష ఫీజులు కట్టిన విషయాన్ని బండి సంజయ్ కుమార్ గుర్తు చేశారు. **మహిళల స్వావలంభనే సర్కార్ ధ్యేయం : డాక్టర్ కవ్వంపల్లి** ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ ఎవరిపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేలా మహిళలను తీర్చిదద్దడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న సంకల్పంతో రేవంత్ రెడ్డి ముందుకు సాగుతున్నారన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలనే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకున్నదని చెప్పారు. మహిళా సంఘాలకు రూ. 10లక్షల రుణంతో పాటు ఇన్సూరెన్స్ కల్పిస్తున్నామని డాక్టర్ కవ్వంపల్లి చెప్పారు. మహిళల్లో కష్టపడే తత్వం మెండుగా ఉండటం వల్ల ప్రభుత్వ పథకాలతో వారు సత్ఫలితాలను సాధిస్తున్నారని చెప్పారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అనేక సంక్షేమ పథకాలు,కార్యక్రమాలన్నీ మహిళా ప్రాంగణం ద్వారా ప్రవేశపెట్టిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. మహిళలను బలోపేతం చేసేలా కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అందిస్తున్న సహాయం, చేస్తున్న కృషి ఎంతో గొప్పదని డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ కొనియాడారు.

## 15 కోట్ల అభివృద్ధి నిధులతో కల్లూరులో

# సీసీ రోడ్ల నిర్మాణానికి శ్రీకారం

**11వ వార్డులో పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్**



**తొలి అక్షరం/కల్లూరు, జులై 3 :** కల్లూరు మున్సిపాలిటీ అభివృద్ధిలో మరో ముందడుగు పడింది. రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ప్రత్యేక చొరవతో, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి దయానంద్ కృషి ఫలితంగా మున్సిపాలిటీ అభివృద్ధికి మంజూరైన రూ. 15 కోట్ల నిధులతో చేపడుతున్న పనుల్లో భాగంగా శుక్రవారం 11వ వార్డులో నూతన సీసీ రోడ్డు నిర్మాణ పనులను ఘనంగా ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ధరావత్ మోహన్ నాయక్, మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి, అధికారులు, ప్రజాప్రతినిధులు కొబ్బరికాయ కొట్టి శాస్త్రోక్తంగా రామానగరం కాలనీలో సీసీ రోడ్డు పనులకు శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా చైర్మన్ ధరావత్ మోహన్ మాట్లాడుతూ మంజూరైన నిధులతో పట్టణంలో రహదారులు, మౌలిక వసతులను మెరుగుపరుస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ భాగం నీరజ ప్రభాకర్, ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షులు కాంగ్రెస్ సీనియర్ నాయకులు పసుమర్తి చందర్ రావు, మున్సిపల్ వైస్ చైర్మన్ శీలం కోటేశ్వరి కృష్ణారెడ్డి, మాజీ ఎంపీటీసీ అంకిరెడ్డి సత్యనారాయణరెడ్డి, కౌన్సిలర్లు కృష్ణశెట్టి లక్ష్మీ ఏడుకొండలు, ఇస్మాయిల్, యాస శ్రీకాంత్, గుండ్ల పుల్లారావు, బీరవల్లి మాధవ్, దాసరి సుధారాణి, భూక్య రాంబాయి, కాంగ్రెస్ పార్టీ నాయకులు పట్టణ అధ్యక్షులు ఉస్మాన్, ఆళ్లకుంట నరసింహారావు, నోటి కృష్ణారెడ్డి, కుంచాల గురవయ్య, మున్సిపల్ అధికారులు, రామానగరం కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# టీ20తో గ్లోబల్ స్పోర్ట్స్‌గా క్రికెట్

వన్డే ఇంటర్నేషనల్ క్రికెట్ యొక్క దీర్ఘకాలిక భవిష్యత్తుపై భారత స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ తీవ్ర సందేహాలు వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో క్రికెట్‌ను ప్రపంచవ్యాప్తంగా విస్తరించడానికి కేవలం టీ20 ఫార్మాట్ మాత్రమే అత్యంత అనుకూలమైనదని ఆయన అభిప్రాయపడ్డారు. తక్కువ సమయంలో ముగిసే మ్యాచ్‌లను ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఎక్కువగా ఇష్టపడతారని, క్రికెట్‌ను ఒక గ్లోబల్ స్పోర్ట్స్‌గా మార్చాలనే ఐసీసీ ఆశయాలకు ఈ ఫార్మాట్ ఎంతో కీలకమని అశ్విన్ పేర్కొన్నారు. క్రికెట్ చరిత్రలోనే ఒక కీలకమైన మలుపు తిరుగుతున్న తరుణంలో అశ్విన్ ఈ వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యత సంతరించుకుంది. దాదాపు 128 సంవత్సరాల సుదీర్ఘ విరామం తర్వాత, 2028 లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌లో క్రికెట్ మళ్లీ రీ-ఎంట్రీ ఇవ్వబోతోంది. చివరిగా 1900 పారిస్ ఒలింపిక్స్‌లో మాత్రమే క్రికెట్ పోటీలు జరిగాయి. వీటికి సంబంధించిన అర్హత ప్రమాణాలను కూడా అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ ఇటీవల అధికారికంగా ప్రకటించింది. వార్తా సంస్థ పీటీఐ నివేదిక ప్రకారం అశ్విన్ మాట్లాడుతూ.. "మరో రెండు సంవత్సరాలలో ఒలింపిక్స్ జరగబోతోంది. క్రికెట్‌ను ప్రపంచ స్థాయి క్రీడగా మార్చడంలో ఐసీసీ నిజంగానే సీరియస్‌గా ఉంటే, ప్రస్తుతం నడుస్తున్న వివిధ టీ20 లీగ్‌లలోని జట్లు ఈ విస్తరణలో చాలా కీలక పాత్ర పోషిస్తాయి" అని అన్నారు. అమెరికాలో జరుగుతున్న మేజర్ లీగ్ క్రికెట్ లో 'సాన్ ఫ్రాన్సిస్కో యూనికార్న్స్' జట్టు తరపున ఆడుతున్న అశ్విన్, ప్రపంచవ్యాప్తంగా ఫ్రాంచైజీ టీ20 లీగ్‌ల వేగవంతమైన వృద్ధి మరియు ఒలింపిక్స్‌లో క్రికెట్ చేరడం వల్ల ఈ క్రీడకు ఆటగాళ్లు మరియు అభిమానుల సంఖ్య విపరీతంగా పెరుగుతుందని విశ్వసిస్తున్నారు. అదే సమయంలో 50 ఓవర్ల ఫార్మాట్ ఉనికిపై ఆయన నేరుగా ప్రశ్నలు లేవనెత్తారు. "క్రికెట్ మరింత పెద్దగా విస్తరించాలంటే ఇదే సరైన మార్గం. దీనివల్ల



వివిధ దేశాల నుంచి ఎక్కువ మంది ప్రతిభావంతులైన ఆటగాళ్లు వెలుగులోకి వస్తారు. ఏడాది పొడవునా జరిగే లీగ్‌లకు కూడా ఇది చాలా అవసరం. క్రీడగా టీ20 ఫార్మాట్ ఎప్పటికీ నిలిచిపోతుంది. కానీ, వన్డే క్రికెట్ భవిష్యత్తు ఎంతవరకు ఉంటుందో నాకైతే ఖచ్చితంగా తెలియడం లేదు" అని అశ్విన్ నిర్మొహమాటంగా చెప్పారు. వన్డే క్రికెట్ భవిష్యత్తుపై ఆందోళన వ్యక్తం చేసిన మొదటి దిగ్గజం అశ్విన్ మాత్రమే కాదు. ఒకవైపు సంప్రదాయ టెస్ట్ క్రికెట్‌కు ఉన్న ఆదరణ, మరోవైపు టీ20 లీగ్‌లకు ఉన్న కమర్షియల్ సక్సెస్ (ఆర్థిక లాభాలు) మధ్య వన్డే ఫార్మాట్ ప్రస్తుతం నలిగిపోతోంది. ఐసీసీ టోర్నమెంట్లు మినహా, రెండు దేశాల మధ్య జరిగే ద్వైపాక్షిక వన్డే సిరీస్‌లకు ఆదరణ భారీగా తగ్గుతోంది. ఇదే విషయమై ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ ఇయాన్ చాపెల్ సైతం గతంలో ఆందోళన వ్యక్తం చేశారు. క్రికెట్ బోర్డుల నిర్వాహకులు తీసుకుంటున్న స్వల్పకాలిక నిర్ణయాలు, టీ20ల ద్వారా వచ్చే ఆర్థిక లాభాలపై చూపిస్తున్న వ్యామోహం వల్లే వన్డేల ప్రజాదరణ తగ్గిపోయిందని, ఈ ఫార్మాట్ కేవలం వరల్డ్ కప్ సమయానికే పరిమితమయ్యేలా మార్చేశారని చాపెల్ విమర్శించారు.

# 36 ఏళ్ల రికార్డును బద్దలు కొట్టిన ఉనై సైమన్


ఫిఫా ప్రపంచ కప్ 2026 లో స్పెయిన్ జట్టు తన విజయ పరంపరను కొనసాగిస్తూ ఘనంగా ప్రీక్వార్టర్స్‌కు చేరుకుంది. టోర్నమెంట్‌లో భాగంగా జరిగిన రౌండ్-32 పోరులో స్పెయిన్ ఏకపక్షంగా ఆస్ట్రియాను 3-0 తేడాతో చిత్తు చేసింది. మ్యాచ్‌లో స్పెయిన్ స్టార్ ప్లేయర్ మైకెల్ 36వ, 89వ నిమిషాల్లో రెండు అద్భుతమైన గోల్స్ సాధించగా, పెడ్రో పోర్రో 66వ నిమిషంలో మరో గోల్ కొట్టి జట్టుకు భారీ విజయాన్ని ఖాయం చేశాడు. ఈ విజయంతో పాటు స్పెయిన్ గోల్ కీపర్ ఉనై సైమన్ ఫుట్‌బాల్ చరిత్రలో ఒక అరుదైన ఘనతను సొంతం చేసుకుని, 36 ఏళ్లనాటి సుదీర్ఘ రికార్డును బద్దలు కొట్టాడు. ప్రపంచకప్ బరిలో ప్రత్యర్థులకు సింహస్వప్నంగా మారిన ఉనై సైమన్, ఏకంగా 519 నిమిషాల పాటు ప్రత్యర్థులను ఒక్క గోల్ కూడా చేయనీయకుండా అడ్డుకుని సరికొత్త ప్రపంచ రికార్డు సృష్టించాడు. దీనితో 1990 వరల్డ్ కప్‌లో ఇటలీ లెజెండరీ ప్లేయర్ వాల్టెర్ జెంగా నెలకొల్పిన 517 నిమిషాల నాటి క్లీన్-షీట్ ఘనతను సైమన్ అధిగమించాడు. గత ప్రపంచ కప్ నుంచి ఈ స్పెయిన్ గోల్ కీపర్ అద్భుత ఆటతీరుకు తిరుగులేకుండా పోయింది. చివరిగా 2022 ప్రపంచ కప్ గ్రూప్ స్టేజ్ మ్యాచ్‌లో జపాన్ జట్టు స్పెయిన్‌పై 51వ నిమిషంలో గోల్ చేసింది. ఆ తర్వాత నుంచి ఇప్పటివరకు జరిగిన ఏ మ్యాచ్‌లోనూ స్పెయిన్ నెట్‌లోకి బంతిని పంపడం ప్రత్యర్థులకు సాధ్యం కాలేదు. ఈసారి లీగ్ స్టేజ్‌లో ఆడిన మూడు మ్యాచుల్లో రెండు విజయాలు, ఒక డ్రాతో గ్రూప్ ఎ లో అగ్రస్థానాన్ని సొంతం చేసుకున్న స్పెయిన్.. ఇప్పుడు నాకౌట్ మ్యాచ్‌లోనూ ఆస్ట్రియాను గోల్ కొట్టనీయకుండా ఉనై సైమన్ అడ్డుకోవడంతో అప్రతిహతంగా దూసుకుపోతోంది. ప్రీక్వార్టర్స్‌లో (రౌండ్-ఆఫ్-



16) స్పెయిన్ జట్టు తదుపరి పోరులో క్రిస్టియానో రొనాల్డో నాయకత్వంలోని బలమైన పోర్చుగల్ జట్టుతో తలపడనుంది. ఫిఫా వరల్డ్ కప్ 2026 నాకౌట్ పోరులో అభిమానులను ఉర్రూతలూగించే హై-డ్రామా మ్యాచ్ చోటుచేసుకుంది. స్టార్ స్ట్రైకర్ క్రిస్టియానో రొనాల్డో, యువ సంచలనం గొంకాలో రామోస్ అద్భుత గోల్స్‌తో పోర్చుగల్ జట్టు 2-1 తేడాతో బలమైన క్రొయేషియాను మట్టికరిపించింది. హోరాహోరీగా సాగిన ఈ రౌండ్-ఆఫ్-32 పోరులో విజయం సాధించడం ద్వారా పోర్చుగల్ ప్రికార్టర్స్ (రౌండ్-ఆఫ్-16) కు దూసుకెళ్లింది.

# రొనాల్డో ప్రపంచ రికార్డ్ నమోదు

పోర్చుగల్ సాకర్ దిగ్గజం 41ఏళ్ల క్రిస్టియానో రొనాల్డో నయా హిస్టరీ క్రియేట్ చేశాడు. 2026 ఫిఫా ప్రపంచ కప్ 'రౌండ్ ఆఫ్ 32'లో క్రొయేషియాతో జరిగిన మ్యాచ్‌లో పోర్చుగల్ 2-1 తేడాతో విజయం సాధించింది. ఈ క్రమంలోనే రొనాల్డో ఫిఫా టోర్నమెంట్ చరిత్రలో కీలక రికార్డును కూడా నెలకొల్పాడు. టొరంటో వేదికగా శుక్రవారం తెల్లవారుజామున పోర్చుగల్ - క్రొయేషియా మధ్య మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్‌లో బరిలోకి దిగడంతోనే రొనాల్డో అరుదైన ఘనత సాధించాడు. ఫిఫా చరిత్రలో నాకౌట్ మ్యాచ్ ఆడిన అత్యంత పెద్ద వయస్కుడిగా రికార్డు కొట్టాడు. నేటికి రొనాల్డో వయసు 41ఏళ్ల 147 రోజులు. అంతేకాకుండా ఈ మ్యాచ్‌లో అతడు ఓ గోల్ సాధించాడు. సెకండ్ హాఫ్‌లో 68వ నిమిషంలో పెనాల్టీ కిక్ ద్వారా రొనాల్డో గోల్ కొట్టాడు. దీంతో ఫిఫా హిస్టరీలో నాకౌట్ మ్యాచ్‌ల్లో గోల్ సాధించిన అత్యంత పెద్ద వయస్కుడిగానూ రొనాల్డో సరికొత్త రికార్డు నెలకొల్పాడు. అంతకుముందు ఈ రికార్డు పోర్చుగల్ ఆటగాడు పేపే పైన ఉంది. అతడు 39ఏళ్ల 283 రోజుల వయసులో 2022 ప్రపంచకప్‌లో స్విట్జర్లాండ్‌పై గోల్ చేశాడు. దీంతో ఈ మ్యాచ్‌కు ముందు పేపే పైనే ఈ రికార్డు కొనసాగుతూ వచ్చింది. తాజాగా దాన్ని రొనాల్డో బ్రేక్ చేశాడు. అయితే ఓవరాల్‌గా ఫిఫా ప్రపంచ కప్ చరిత్రలో గోల్ చేసిన అత్యంత పెద్ద వయస్కుడిగా మాత్రం రోజర్ మిలా (కామెరూనియన్) కొనసాగుతున్నారు. అతడు 42ఏళ్ల 39 రోజుల వయస్సులో 1994 ఫిఫా ప్రపంచ



కప్‌లో రష్యాపై గోల్ కొట్టాడు. ఫిఫా ప్రపంచ కప్ నాకౌట్ మ్యాచ్‌లో గోల్ సాధించడం రొనాల్డోకు ఇదే తొలిసారి కావడం విశేషం. అతడు అంతకుముందు ఫిఫాలో అనేక గోల్స్ చేసినా, కీలకమైన నాకౌట్ మ్యాచ్‌ల్లో మాత్రం గోల్ కొట్టలేదు. తాజా మ్యాచ్‌తో రొనాల్డో కెరీర్‌లో ఆ లోటు కూడా తీరిపోయింది. ఇక ప్రస్తుత వరల్డ్‌కప్‌లో రొనాల్డోకు ఇది మూడో గోల్. గ్రూప్ స్టేజ్‌లో అతడు ఉజ్బెకిస్థాన్‌పై రెండు గోల్స్ చేశాడు. అలాగే ఓవరాల్‌గా ఫిఫాలో రొనాల్డోకు ఇది 15వ గోల్. కెరీర్ చివరిదశలో ఉన్న రొనాల్డో ఈ వరల్డ్‌కప్ ముగిసేలోపే రిటైర్మెంట్ ఇచ్చేస్తాడని ప్రచారం మొదలైంది. పైగా దీనిపై తన నిర్ణయాన్ని ఈ వరల్డ్‌కప్‌లోనే ప్రకటిస్తాడని రొనాల్డో సోదరి ఈ మ్యాచ్‌కు ముందు సోషల్ మీడియాలో ఓ పోస్టు షేర్ చేసింది. దీంతో అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. అయితే మ్యాచ్ ముగిసిన తర్వాత రొనాల్డో ఈ ప్రచారంపై స్పందించాడు. తొందపడి ఎప్పుడూ తాను నిర్ణయాలు తీసుకోనని స్పష్టం చేశాడు. 'నేను తొందరపడి ఏ నిర్ణయం తీసుకోను. ఏ విషయంలోనైనా ఈ వరల్డ్‌కప్ ముగిసిన తర్వాతే నిర్ణయం తీసుకుంటా' అని రొనాల్డో రిటైర్మెంట్‌పై క్లారిటీ ఇచ్చాడు. కాగా, తాజా విజయంతో పోర్చుగల్ రౌండ్ ఆఫ్ 16 (ప్రీ క్వార్టర్స్) కు అర్హత సాధించింది. ఇక ప్రీ క్వార్టర్స్‌లో ఆ జట్టు స్పెయిన్ ఢీ కొట్టాల్సి ఉంది. ఈ మ్యాచ్ జులై 07న జరగనుంది. ఇక మ్యాచ్ విషయానికొస్తే, తొలి అర్ధభాగంలో ఏ జట్టు కూడా గోల్ కొట్టలేదు. కానీ అద్భుతమై ఆటతో క్రొయేషియా ఆకట్టుకుంది. రెండో అర్ధభాగం ప్రారంభంలోనే ఇవాన్ పెరిసిచ్ కొట్టిన గోల్‌తో క్రొయేషియా ఆధిక్యంలోకి వచ్చింది. ఆ తర్వాత 68వ నిమిషంలో పెనాల్టీ ద్వారా రొనాల్డో గోల్ సాధించి, స్కోరును సమం చేశాడు. అదనపు సమయంలోని 94వ నిమిషంలో గొంజలో రామోస్ గోల్ సాధించి పోర్చుగల్‌ను విజేతగా నిలిపాడు.

# వైభవ్ ఇంకా వెయిట్ చేయించడం ఎందుకు..?

**● సౌతాఫ్రికా దిగ్గజం ఏబీ డివిలియర్స్**



ప్రపంచ క్రికెట్‌లో ప్రస్తుతం టీమిండియా యంగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ హాట్ టాపిక్‌గా మారిపోయాడు. ఐపీఎల్ 2026లో పరుగుల వరద పారించి.. హేమాహేమీ ప్లేయర్లను సైతం వెనక్కి నెట్టి ఆరెంజ్ క్యాప్ దక్కించుకున్న ఈ బుడ్డోడు.. ఇటీవల ముక్కోణపు సిరీస్‌లోనూ సత్తాచాటాడు. ఇదే జోరులో టీమిండియా టీ20 జట్టు నుంచి పిలుపు అందుకున్నాడు. అయితే జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ.. అతడికి ప్లేయింగ్ లెవెన్‌లో ఆడే అవకాశం రావట్లేదు. ఇటీవల ఐర్లాండ్‌తో ముగిసిన రెండు టీ20లు, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లోనూ అతడు బెంచ్‌పైనే కూర్చున్నాడు. ఇదే విషయంపై సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం ఏబీ డివిలియర్స్ మాట్లాడాడు. ముఖ్యంగా అందరు ఆటగాళ్ల మాదిరిగానే అరంగేట్రం విషయంలో వైభవ్ సూర్యవంశీ కూడా వెయిట్ చేయాల్సి ఉంటుందని ఇటీవల టీమిండియా అసిస్టెంట్ కోచ్ దస్కటే చేసిన వ్యాఖ్యలను డివిలియర్స్ వ్యతిరేకించాడు. ప్రస్తుతం అతడి ప్రదర్శన చూశాక.. ఇంకా వెయిట్ చేయించడం ఎందుకని ప్రశ్నించాడు. "వైభవ్ సూర్యవంశీని ఎప్పుడు భారత తుది జట్టులోకి తీసుకుంటారు ఐర్లాండ్‌తో సిరీస్ అతడికి మంచి అవకాశంగా ఉండేది. కానీ అతడిని ఆ సిరీస్‌లో ఆడించలేదు. ఇది దురదృష్టకరం. సూర్యవంశీ కూడా ఇతర ఆటగాళ్ల మాదిరిగానే అరంగేట్ర ప్రక్రియను అనుసరించాల్సిందేనన్న భారత కోచ్‌తో నేను విభేదిస్తున్నాను. ఐపీఎల్‌లో అతడి ఆటను చూశాక.. ఇంకా అతడిని వెయిట్ చేయించడం ఎందుకు వైభవ్‌ను ఐర్లాండ్‌పై ఆడిస్తే బాగుండేది. కాస్త అనుభవం కూడా వచ్చేది కదా" అని ఏబీ డివిలియర్స్ వ్యాఖ్యానించాడు. మరోవైపు టీమిండియా ఓపెనర్ సంజూ శాంసన్ ఇటీవల దారుణంగా విఫలం అవుతున్నాడు. ఐర్లాండ్‌తో 2 మ్యాచ్‌లు, ఇంగ్లాండ్‌తో తొలి టీ20లో సింగిల్ డిజిట్‌కే పెవిలియన్ చేరిపోయాడు. దీంతో అతడి ప్లేసులో వైభవ్‌కు రెండో టీ20లో చోటు ఇవ్వాలనే డిమాండ్‌లు పెరిగిపోయాయి. అయితే మరికొందరు మాత్రం.. సీనియర్లను తప్పించి కుర్రాడిని ఇప్పుడే ఆడించొద్దని సూచిస్తున్నారు. మరి రెండో టీ20లో అతడికి చోటు ఉంటుందా.. మరోసారి బెంచ్‌కే పరిమితం కావాల్సి వస్తుందా అనేది తేలాల్సి ఉంది.

# మెదక్‌పై నల్గొండ ఘన విజయం

నురాగ్ నల్గొండ నైట్స్ గెలుపు ట్రాక్ ఎక్కింది. గత మ్యాచ్‌లో ఖమ్మం చేతిలో ఓడిన నల్గొండ, తాజాగా మెదక్‌ను చిత్తు చేసింది. ఉప్పల్ వేదికగా శుక్రవారం జరిగిన మ్యాచ్‌లో మెదక్‌పై నల్గొండ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. మెదక్ నిర్దేశించిన 181 పరుగుల టార్గెట్‌ను నల్గొండ 16.3 ఓవర్లలోనే ఛేదించింది. ఓపెనర్ గౌరవ్ రెడ్డి (101 నాటౌట్) సెంచరీతో ఆకట్టుకున్నాడు. జశ్వంత్ మోతె (34 పరుగులు) ఫర్వాలేదనిపించాడు. మెదక్ బౌలర్లలో అర్జున్, మధుకర్ చెరో 1 వికెట్ పడగొట్టారు. ఓ మోస్తారు ఛేదనను నల్గొండ ఘనంగానే ఆరంభించింది. గౌరవ్ రెడ్డి తొలి నుంచే దూకుడుగా ఆడడంతో పవర్ ప్లేలోనే భారీగా పరుగులు వచ్చాయి. జస్వంత్ కూడా ఆకట్టుకున్నాడు ఈ ఇద్దరు తొలి వికెట్‌కు 40 బంతుల్లోనే 83 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. 6.4 ఓవర్ వద్ద జస్వంత్ ఔట్ అయ్యాడు. అయినా గౌరవ్ జోరు తగ్గలేదు. బౌండరీలు బాదుతూ స్కోర్ బోర్డును పరుగులు పెట్టించాడు. వన్ డౌన్‌లో వచ్చిన నితీశ్ (21) స్వల్ప స్కోరుకే మధుకర్ బౌలింగ్‌లో 12.2 వద్ద ఔటయ్యాడు. కానీ అప్పటికే నల్గొండ గెలుపు ఖాయమైంది. చివర్లో సెంచరీతోపాటు గౌరవ్ మ్యాచ్‌ను కూడా ముగించాడు. అంతకుముందు బ్యాటింగ్ చేసిన మెదక్ ఫాల్కన్స్ 20 ఓవర్లలో నాలుగు వికెట్లు కోల్పోయి 180 పరుగులు చేసింది. విక్రమ్ నాయక్ (48 పరుగులు నాటౌట్), వరుణ్ ఎర్రమ్ (44 పరుగులు) రాణించారు. శ్రుంజిత్ రెడ్డి



(30 పరుగులు), తెలుకుపల్లి రవితేజ (33 పరుగులు) ఫర్వాలేదనిపించారు. నల్గొండ బౌలర్లలో ఇయాన్ సతాని, చింతల రక్షన్ రెడ్డి, అనికేత్ రెడ్డి తలో 1 వికెట్ దక్కించుకున్నారు. తాజా ఓటమితో మెదక్ టీజీ 20 లీగ్ ప్లేఆఫ్స్ రేసు నుంచి నిష్క్రమించింది! ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌లు ఆడిన ఆ జట్టు కేవలం ఒకే దాంట్లో నెగ్గింది. మిగిలిన ఐదు మ్యాచ్‌ల్లోనూ ఓడిపోయి పాయింట్ల పట్టికలో అట్టడుగున ఉంది. మరోవైపు, నల్గొండ నాలుగో విజయంతో రెండో స్థానంలోకి దూసుకెళ్లింది. ఇప్పటిదాకా ఆరు మ్యాచ్‌లు ఆడిన నల్గొండ రెండు ఓటములు, నాలుగు విజయాలు 8 పాయింట్లతో ప్లేఆఫ్స్‌కు దగ్గరైంది. ఇక ఆడిన ఐదు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన హైదరాబాద్ ఈ ఛాంపియన్స్ 10 పాయింట్లతో టాప్‌లో ఉంది.

# సంజూ శాంసన్ తీవ్రమైన ఒత్తిడి



ఇండియా స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ సంజూ శాంసన్ ప్రెజెంట్ కెరీర్ లోనే మోస్ట్ డిఫికల్ట్ ఫేజ్ ను ఫేస్ చేస్తున్నాడు. టీమిండియా మేనేజ్‌మెంట్ అతనిపై నమ్మకం ఉంచినప్పటికీ, బయట నుంచి వస్తున్న విమర్శలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. లాస్ట్ మూడు ఇన్నింగ్స్‌లలో 5, 0, 1 రన్స్ మాత్రమే చేసి దారుణంగా ఫెయిల్ అవ్వడం శాంసన్ పొజిషన్ ను రిస్క్ లో పడేసింది. ఐర్లాండ్‌తో జరిగిన రెండు మ్యాచ్ లతో పాటు ఇంగ్లాండ్‌తో జరిగిన ఫస్ట్ టీ20 మ్యాచ్ లోనూ అతను పూర్తిగా నిరాశపరిచాడు. ఇదే టైమ్‌లో 15 ఏళ్ల బ్యాటింగ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ ప్లేయింగ్ ఎలెవన్ లో ఛాన్స్ కోసం వెయిట్ చేస్తుండటంతో శాంసన్ పై ప్రెజర్ నెక్స్ట్ లెవెల్ కు చేరింది. ఈ నేపథ్యంలో ఇండియా మాజీ లు సంజూ శాంసన్ బ్యాటింగ్ లో ఉన్న ఒక మేజర్ టెక్నికల్ లోపాన్ని ఎక్స్ పోజ్ చేశారు. సంజూ శాంసన్ ను అవుట్ చేయడానికి బౌలర్లు ఎలాంటి ప్లాన్ ఫాలో అవుతున్నారో నిపుణులు క్లియర్ గా ఎక్స్ ప్లెయిన్ చేస్తున్నారు. సంజూ బ్యాటింగ్ చేసేటప్పుడు అతని బ్యాట్ ఫేస్ కంప్లీట్‌గా క్లోజ్ అయి ఉంటుందని, అందుకే బౌలర్లు బాల్ ను ఆఫ్ స్టంప్ కు వెలుపల వేయడానికి ట్రై చేస్తున్నారని అంటున్నారు. క్లోజ్డ్ బ్యాట్ ఫేస్ తో ఉన్నప్పుడు అతను ఆఫ్ సైడ్ షాట్లు ఆడటానికి ప్రయత్నించినప్పుడు బ్యాట్ ఫేస్ ఒక్కసారిగా ఓపెన్ అవుతుందని, ఈ టెక్నికల్ ఫ్లా వల్లే అతను వికెట్లు పారేసుకుంటున్నాడని మాజీ ఆల్ రౌండర్ ఇర్ఫాన్ పఠాన్ స్పష్టం చేశాడు. ఐర్లాండ్ తో జరిగిన ఫస్ట్ మ్యాచ్ లో బాల్ ను ఆన్ ది అప్ ఆడబోయి ఇన్‌సైడ్ ఎడ్జ్ తో క్లీన్ బౌల్డ్ అయ్యాడని, ఇంగ్లాండ్ పై జరిగిన మ్యాచ్ లోనూ ఆఫ్ స్టంప్ అవతలి బాల్ ను అనవసరంగా కెలుక్కుని థర్డ్ మ్యాన్ లో క్యాచ్ ఇచ్చాడని పఠాన్ విశ్లేషించాడు. మరో ఎండ్ లో బిహార్ కు చెందిన 15 ఏళ్ల వండర్ కిడ్ వైభవ్ సూర్యవంశీ ఇంటర్నేషనల్ డెబ్యూ కోసం క్రికెట్ లోకమంతా ఈగర్‌గా వెయిట్ చేస్తోంది.

# నాగబంధం గ్రాఫిక్స్ హైలెట్

## కథా కథనంలో కనిపించని పట్టు

సినిమా నిర్మాణ దశ నుంచే తెలుగు ఆడియెన్స్‌లో ఎంతో ఆసక్తిని రేకెత్తించిన చిత్రం నాగబంధం. భారీ గ్రాఫిక్ హంగులతో విడుదలైన ప్రచార చిత్రాలు ప్రేక్షకులను బాగా ఆకట్టుకున్నాయి. డివైన్ థ్రిల్లర్‌గా రూపొందిన ఈ చిత్రంలో విరాట్ కర్ణ హీరోగా నటించగా, అభిషేక్ నామా దర్శకత్వం వహించారు. భారీ అంచనాలతో ఈ సినిమా శుక్రవారం విడుదలై ప్రేక్షకులను మెప్పించింది. అనాథ అయిన రుద్ర (విరాట్ కర్ణ)ను పద్మమ్మ (శరణ్య) చేరదీసి సొంత కొడుకులా పెంచుతుంది. తన చెల్లెలి (సోనియా సింగ్) పెళ్లిని రాజు అనే యువకుడితో ఘనంగా చేయాలని రుద్ర అనుకుంటాడు. సరిగ్గా పెళ్లి సమయంలో రంగనాథ స్వామి ఆలయంలోని బ్రహ్మకమలం కోసం రుద్ర కుటుంబంపై జుల్ఫికర్ అలీ (రిషబ్) దాడి చేస్తాడు. ఈ ప్రమాదంలో రుద్ర ఫ్యామిలీలోని అందరూ చనిపోతారు. వేల ఏళ్లుగా రంగనాథ స్వామి ఆలయంలో పూజలందుకుంటున్న బ్రహ్మకమలంతో రుద్రకు ఉన్న సంబంధం ఏమిటి? ఆ బ్రహ్మకమలాన్ని దొంగతనం చేయాలని ఆర్కియాలజిస్ట్ ప్రభాకర్ (జగపతిబాబు)తో పాటు అతని కూతురు పార్వతి (నభా నటేష్) ఎలాంటి ప్రయత్నాలు చేశారు? ఆలయంలోని బ్రహ్మకమలం, గరుడ మంత్రాలతో పాటు నాగబంధం గ్రంథం సాయంతో అమరత్వం పొందాలని జుల్ఫికర్ అలీ, భైరాగి (గరుడ రామ్) ఎలాంటి మారణహోమానికి పాల్పడ్డారు? కైలాస పర్వతంలోని విరాటస్వామి ఆలయంలోని ఓ గదిలో ఉన్న రహస్యం ఏమిటి? 17వ శతాబ్దంలో హిందూ దేవాలయాలను దోచుకున్న అబ్దాలీని నాగసాధువు ఎలా నిలువరించాడు? అన్నదే నాగబంధం మూవీ కథ. కేరళలోని అనంత పద్మనాభ స్వామి ఆలయానికి నాగబంధం రక్షణగా ఉందనే కథ ప్రచారంలో ఉంది. ఆ నాగబంధాన్ని విచ్ఛిన్నం చేయాలంటే గరుడ మంత్రాలు తెలిసి ఉండాలని పురాణాల్లో రాసి ఉంది. ఈ పాయింట్ నుంచే దర్శకుడు అభిషేక్ నామా స్ఫూర్తి పొంది నాగబంధం కథను రాసుకున్నారు. ఈ చిన్న పాయింట్‌కు సనాతన ధర్మం, హైందవ సంస్కృతితో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, లవ్‌స్టోరీని జోడించి సినిమాను రూపొందించారు. నాగబంధం విముక్తి కోసం ప్రయత్నించే అసాంఘిక శక్తులు, దేవుడి అండతో వారిని ఎదుర్కొనే సామాన్యుడైన హీరో.. ఈ అంశాల చుట్టే నాగబంధం కథ సాగుతుంది. ప్రతి ఫ్రేమ్ కలర్‌ఫుల్‌గా ఉంటుంది.




అబ్బురపరిచే సెట్స్, అదిరిపోయే గ్రాఫిక్స్ లార్జర్ దేన్ లైఫ్‌లాంటి అనుభూతిని అందిస్తాయి. యాక్షన్ ఎపిసోడ్స్ బాగున్నాయి. భైరవకోన ఎపిసోడ్, మానసాదేవి టెంపుల్‌లో జరిగే ఫైట్‌తో పాటు అబ్దాలీ మనుషులకు, నాగసాధువులకు మధ్య జరిగే వార్ సీన్లు గూస్‌బంప్స్ కలిగిస్తాయి. అయితే యాక్షన్ సీక్వెన్స్‌లు సుదీర్ఘంగా సాగడం మాత్రం సినిమాకు మైనస్‌గా మారింది. నాగబంధం కథను మొదలుపెట్టిన తీరు బాగుంది. ఫ్యామిలీ సీన్లు కథకు పెద్దగా అతకలేదు. కథ మొత్తం బ్రహ్మకమలం చుట్టే తిరగడంతో సాగదీసిన ఫీలింగ్ కలుగుతుంది. రెండు డిఫరెంట్ షేడ్స్‌తో సాగే పాత్రలో హీరోగా విరాట్ కర్ణ మెప్పించాడు. నాగసాధువుగా అతని లుక్ బాగుంది. యాక్షన్ సన్నివేశాల్లో మెప్పించినా, ఎమోషనల్ సీన్ల పరంగా ఇంకా పరిణితి చూపించాల్సి ఉంది. నభా నటేష్‌కు మంచి రోల్ దక్కింది. పాజిటివ్, నెగెటివ్ కోణాల్లో ఆమె పాత్ర సాగుతుంది. కొద్దిసేపు డ్యూయల్ రోల్‌లో కనిపిస్తుంది. విలన్‌గా రిషబ్ డైలాగ్ డెలివరీ, బాడీలాంగ్వేజ్ విభిన్నంగా ఉన్నాయి. మరో హీరోయిన్ ఐశ్వర్య మీనన్‌కు ఒకటి రెండు డైలాగ్స్ తప్ప పెద్దగా ఇంపా÷–టం్గ÷న్స్ లేదు. జగపతిబాబు, మురళీ శర్మ, మహేష్ మంజ్రేకర్, శరణ్య, అనసూయ, సోనియా సింగ్, అంకిత్ కొయ్యతో పాటు సినిమాలో చాలామందే యాక్టర్లు కనిపిస్తారు కానీ, తమ నటనను చాటిచెప్పే అవకాశం ఎవరికీ దక్కలేదు. విజువల్స్, గ్రాఫిక్స్ పై పెట్టిన శ్రద్ధ కథపై కూడా పెట్టి ఉంటే నాగబంధం రిజల్ట్ మరోలా ఉండేది. చిన్న చిన్న లోపాలున్నా నాగబంధం ప్రేక్షకులను కొంతవరకు మెప్పిస్తుంది.

# ఆసక్తికరంగా సాగిన రావు బహదూర్

'కేరాఫ్ కంచరపాలెం', 'ఉమా మహేశ్వర ఉగ్రరూపస్య' లాంటి విజయవంతమైన చిత్రాలతో ప్రేక్షకుల్ని మెప్పించిన దర్శకుడు వెంకటేశ్ మహా. ఇప్పుడాయన సత్యదేవ్‌తో కలిసి చేసిన ప్రయోగాత్మక చిత్రం 'రావు బహదూర్'. దీనికి మహేశ్‌బాబు స్వయంగా సమర్పకుడిగా వ్యవహరించడం.. ఇందులో సత్యదేవ్ భిన్న గెటప్పుల్లో కనిపించనుండటం.. టీజర్, ట్రైలర్లు ఆసక్తిరేకెత్తించేలా ఉండటంతో ప్రేక్షకుల్లో ఈ సినిమాపై మంచి అంచనాలేర్పడ్డాయి. 1968 – 1991 మధ్య కాలంలో సాగే కథ ఇది. రామప్ప రావు బహదూర్ (సత్యదేవ్) ఓ రాజవంశీకుడు. కాలేయ క్యాన్సర్‌తో పోరాడుతూ జీవిత చరమాంకంలో ఉంటాడు. అతను కొన్ని నెలలకు మించి బతకడని డాక్టర్లు చెప్పినప్పటికీ.. వాళ్ల అంచనాల్ని తలకిందులు చేస్తూ నిక్షేపంగా జీవిస్తుంటాడు. అయితే, తీవ్రమైన మానసిక రుగ్మతలతో సతమతమవుతుంటాడు. ముఖ్యంగా అతన్ని ఓ అనుమానం పెనుభూతంలా పట్టిపీడిస్తుంటుంది. దాన్ని తీరిస్తే చాలు.. సంతోషంగా ప్రాణం వదిలేస్తానని తన మిత్రుడు, వ్యక్తిగత వైద్యుడు ఆచారి (వికాస్ ముప్పాల) దగ్గర మాట తీసుకుంటాడు. మరి అతనికున్న ఆ అనుమానమేంటి? దానివల్ల అతని చుట్టూ ఉన్న వాళ్లని ఎన్ని రకాలుగా ముప్పుతిప్పలు పెట్టాడు? అసలు రామప్ప గతమేంటి? రేణుక (దీపా థామస్)తో ప్రేమ, పెళ్లి ప్రయాణం ఎలా సాగింది? ఆమెకి దూరంగా రామప్ప ఒంటరిగా జీవించడానికి వెనకున్న కారణమేంటి? అన్నది సినిమా కథ. ఇదొక విభిన్నమైన సైకలాజికల్ డ్రామా. జీవిత చరమాంకంలో ఉన్న ఓ రాజవంశీకుడు తనకున్న అనుమానం అనే జబ్బుతో చుట్టూ ఉన్న వాళ్లని సైకలాజికల్‌గా ఆడుకుంటూ తన కోరికని ఎలా నెరవేర్చుకున్నాడన్నది క్లుప్తంగా ఈ చిత్ర కథాంశం. పైకిది ఓ రాజవంశ కథలా కనిపించినా.. అంతర్లీనంగా సమాజంలో తరతరాలుగా గూడుకట్టుకుపోయిన వివక్షాపూరిత వ్యక్తిత్వాల గురించి చర్చిస్తుంది. ప్రధానంగా కుల వ్యవస్థ, రంగు, రక్తసంబంధాలు, వారసత్వ హోదాపై ఉన్న పిచ్చిని ఈ చిత్రం బలంగా ప్రశ్నిస్తుంది. కానీ, ఈ సినిమాతో దర్శకుడు వెంకటేశ్ మహా చెప్పాలనుకున్న విషయం ఆలోచన రేకెత్తించేదే అయినా.. దాన్ని ఆద్యంతం జనరంజకంగా మలచడంలో అక్కడక్కడా తడబడ్డారు. ఓ ఫొటో ఫ్రేమ్ నుంచి బయటకొచ్చిన పిల్లాడిని ఊడలు తరుముకుంటూ రావడం.. తనని తిరిగి సమాధిలో బంధించడం.. కట్ చేస్తే మంచం పట్టిన స్థితిలో వృద్ధ పాత్రలో హీరోని పరిచయం చేయడం.. ఇలా




ఆరంభ సన్నివేశాలు ఏదో కొత్త కథని, కొత్త ప్రపంచాన్ని చూడబోతున్నామన్న ఆసక్తిని కలిగించేలా చేస్తాయి. కానీ, సినిమాలో వేగం కనిపించదు. ప్రేక్షకుడికి అసలు కథేంటన్నది అంతుచిక్కడానికి విరామం వరకు వేచి చూడాల్సి వస్తుంది. భువనాలయ ప్రపంచం.. అందులోని రావు బహదూర్ జీవితం.. అతని గతం.. రేణుకతో ప్రేమాయణం అన్నీ నెమ్మదిగా సాగిపోతుంటాయి. హీరో ఎప్పుడైతే తన అనుమానం తీర్చుకునేందుకు ప్రయత్నాలు మొదలు పెడతాడో అక్కడి నుంచే కథలో సంఘర్షణ రెట్టింపవుతుంది. ఈ క్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ద్వితీయార్ధంపై ఆసక్తిని పెంచేలా ఉంటాయి. ఇక సెకండాఫ్ మొదలైనప్పటి నుంచి కథ కాస్త గాడిన పడిన అనుభూతి కలుగుతుంది. హీరో గతం.. చిన్న కొడుకుపై వివక్ష చూపించడానికి వెనకున్న కారణం.. దాని చుట్టూ నడిపిన డ్రామా అన్నీ ఆకట్టుకుంటాయి. ఇక ఈ కథలోకి పోలీస్ పాత్ర ఎప్పుడైతే ఎంట్రీ ఇస్తుందో.. అక్కడి నుంచి సినిమా ఇంకాస్త ఆసక్తికరంగా మారుతుంది.



# సమంత నటన అద్భుతం..

## 'మా ఇంటి బంగారం'పై అఖిల్ అక్కినేని ప్రశంసలు

అక్కినేని యువ కథానాయకుడు అఖిల్, టాలీవుడ్‌లో ఇటీవల ఇండస్ట్రీ హిట్‌గా నిలిచిన 'మా ఇంటి బంగారం' చిత్రంపై, అందులో సమంత నటనపై ప్రశంసల వర్షం కురిపించారు. ప్రస్తుతం తాను హీరోగా నటిస్తున్న 'లెనిన్' సినిమా ప్రమోషన్లలో భాగంగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో ఆయన ఈ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఒకరి విజయాన్ని మరొకరు గౌరవించుకోవడం పట్ల ఇండస్ట్రీ వర్గాలు, అభిమానులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే.. తన 'లెనిన్' సినిమా ప్రచార కార్యక్రమాలతో బిజీగా ఉండటం వల్ల 'మా ఇంటి బంగారం' చిత్రాన్ని ఇంకా పూర్తిగా చూడలేదని అఖిల్ తెలిపారు. అయితే, ఆ సినిమా ట్రైలర్ చూశానని, దాని వైబ్ అద్భుతంగా ఉందని అన్నారు. "ట్రైలర్ చూడగానే ఈ సినిమా కచ్చితంగా పెద్ద విజయం సాధిస్తుందనే నమ్మకం కలిగింది. ఒక మంచి కోడలు తన అత్తారింటి మనసులు గెలుచుకోవాలనే సున్నితమైన ఫ్యామిలీ పాయింట్‌కు, పవర్‌ఫుల్ యాక్షన్‌ను జోడించి చాలా సహజంగా తెరకెక్కించారు" అని చిత్ర బృందాన్ని మెచ్చుకున్నారు. ముఖ్యంగా ఒక మహిళా ప్రధాన పాత్రతో అంత భారీ స్థాయిలో యాక్షన్ సన్నివేశాలు చిత్రీకరించడం గొప్ప విషయమని అఖిల్ కొనియాడారు. ఈ చిత్రంలో సమంత తన పాత్రలో అద్భుతంగా ఒదిగిపోయిందని ప్రశంసించారు. ఈ సందర్భంగా "కంగ్రాట్స్ సామ్" అంటూ సమంతకు, చిత్ర యూనిట్‌కు ప్రత్యేకంగా తన అభినందనలు తెలియజేశారు. నాగచైతన్యతో విడాకుల తర్వాత కూడా అక్కినేని కుటుంబ సభ్యులతో సమంతకు, ముఖ్యంగా అఖిల్‌తో ఉన్న స్నేహపూర్వక సంబంధం, వృత్తిపరమైన గౌరవం మరోసారి బయటపడింది. ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగుతున్న తీరు అందరినీ ఆకట్టుకుంటోంది. ఇక అఖిల్ కథానాయకుడిగా నటిస్తున్న 'లెనిన్' చిత్రం జులై 10న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# 'గుర్తుకొస్తున్నాయి' సిరీస్‌కు ఐకాన్ స్టార్ అండ..

## నిర్మాతగా మారిన మిత్రుడికి బన్నీ ఎమోషనల్ విషెస్



'బేబీ' చిత్రంతో యువతలో మంచి క్రేజ్ సంపాదించుకున్న విరాజ్ అశ్విన్, యశశ్రీ రావు జంటగా నటించిన వెబ్ సిరీస్ 'గుర్తుకొస్తున్నాయి'. ఫీల్ గుడ్ స్కూల్ డేస్ జ్ఞాపకాల నేపథ్యంలో తెరకెక్కిన ఈ సిరీస్, జులై 3 నుంచి 'ఈటీవీ విన్' ఓటీటీలో స్ట్రీమింగ్ అవుతూ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. ఈ సిరీస్‌కు సానుకూల స్పందన వస్తున్న తరుణంలో, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ చిత్ర బృందానికి తన మద్దతు తెలుపుతూ సోషల్ మీడియాలో ఒక ప్రత్యేక పోస్ట్ పెట్టారు. ఇది ఇప్పుడు ఇండస్ట్రీ వర్గాల్లో ఆసక్తిని రేపుతోంది. ఈ సిరీస్ ద్వారా ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ శరత్ చంద్ర నాయుడు పూర్తిస్థాయి నిర్మాతగా పరిచయమయ్యారు. గతంలో 'చావు కబురు చల్లగా', 'వినరో భాగ్యము విష్ణు కథ' వంటి చిత్రాలకు పనిచేసిన శరత్‌తో ఉన్న అనుబంధం దృష్ట్యా అల్లు అర్జున్ ఆయన్ను ప్రత్యేకంగా అభినందించారు. ఈ మేరకు 'ఎక్స్' వేదికగా బన్నీ ఒక ఎమోషనల్ పోస్ట్ చేశారు.

""గుర్తుకొస్తున్నాయి' సిరీస్ గురించి చాలా అద్భుతమైన విషయాలు వింటున్నాను. నా ప్రియమైన శరత్ చంద్రకు, చిత్ర యూనిట్ మొత్తానికి నా హృదయపూర్వక అభినందనలు. నువ్వు ఒక నిర్మాతగా నీ మొదటి అడుగు వేయడం చూడటం నాకు ప్రత్యేకంగా చాలా సంతోషాన్ని ఇస్తోంది. ఈ అందమైన సిరీస్ ప్రేక్షకుల ప్రేమాభిమానాలు, ప్రశంసలతో పాటు గొప్ప విజయాన్ని అందుకోవాలని ఆకాంక్షిస్తున్నాను. చిత్ర తారాగణానికి, సాంకేతిక నిపుణులందరికీ నా శుభాకాంక్షలు. ఈ సిరీస్‌ను ఈటీవీ విన్‌లో చూడటానికి ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను" అని బన్నీ తన పోస్ట్‌లో పేర్కొన్నారు.

వినోద్ గాలి దర్శకత్వం వహించిన ఈ సిరీస్, స్కూల్ రోజుల నాటి మధుర జ్ఞాపకాలను గుర్తుచేస్తూ యువతను, కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకుంటోంది. వెబ్ సిరీస్‌గా వచ్చిన కంటెంట్‌కు అల్లు అర్జున్ వంటి అగ్ర నటుడి





నుంచి ప్రశంసలు, మద్దతు లభించడం చిత్ర యూనిట్‌లో కొత్త ఉత్సాహాన్ని నింపింది. బన్నీ పోస్ట్‌తో ఈ సిరీస్‌పై ప్రేక్షకుల్లో మరింత ఆసక్తి పెరిగింది. ఐకాన్ స్టార్ నుంచి లభించిన ఈ మద్దతుకు చిత్ర బృందం ఆనందం వ్యక్తం చేస్తోంది

# జయకృష్ణ ఘట్టమనేని 'శ్రీనివాస మంగాపురం' రిలీజ్ డేట్ ఫిక్స్



సూపర్ స్టార్ మహేశ్ బాబు సోదరుడి కుమారుడు జయకృష్ణ ఘట్టమనేని హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'శ్రీనివాస మంగాపురం'. ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం అధికారికంగా ప్రకటించింది. ఈ జూలై 30న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానున్నట్లు శుక్రవారం వెల్లడించింది. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి రవీనా టాండన్ కుమార్తె రాషా తడానీ హీరోయిన్‌గా నటిస్తూ టాలీవుడ్‌కు పరిచయమవుతోంది. 'RX 100', 'మంగళవారం' వంటి విజయవంతమైన చిత్రాల దర్శకుడు అజయ్ భూపతి ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. తిరుపతి నేపథ్యంలో సాగే ఓ ఇంటెన్స్ లవ్‌స్టోరీగా ఈ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. స్నేహితులుగా ఉండి ప్రేమికులుగా మారిన వాసుబాబు, మంగల కథ ఇది. వారి ఆనందమయ జీవితంలోకి ఓ ఊహించని సంఘర్షణ ఎదురైనప్పుడు ఏం జరిగిందనేదే కథాంశం. తనదైన శైలిలో యాక్షన్, డ్రామా జోడించి అజయ్ భూపతి ఈ ప్రేమకథను తీర్చిదిద్దినట్లు తెలుస్తోంది



# ఎఐ సాయంతో డీప్‌ఫేక్ చిత్రాలు

## బాంబే హైకోర్టును ఆశ్రయించిన ప్రీతిజింతా

బాలీవుడ్ ప్రముఖ నటి ప్రీతి జింతా బాంబే హైకోర్టును ఆశ్రయించింది. తన అనుమతి లేకుండా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సాంకేతికత వాడి సృష్టించిన డీప్‌ఫేక్ చిత్రాలు, మార్ఫింగ్ చేసిన అసభ్యకర కంటెంట్‌కు వ్యతిరేకంగా ఆమె కోర్టుకు వెళ్లింది. ఈ కంటెంట్‌ను ఇంటర్నెట్ నుండి పూర్తిగా తొలగించేలా అత్యవసర ఆదేశాలు ఇవ్వాలని ఆమె కోర్టును కోరారు. ఇక ఈ పిటిషన్‌పై విచారణ జరిపిన జస్టిస్ మాధవ్ జామదార్.. కంటెంట్‌ను వెబ్‌సైట్ల నుండి తొలగించడానికి ఒక సులువైన విధానాన్ని రూపొందించాలని ఇరు పక్షాలకు సూచించింది. కాగా దీనిపై తదుపరి విచారణ జూలై 6న జరగనుంది. ప్రీతి జింతా దాఖలు చేసిన ఈ వ్యాజ్యంలో గూగుల్, మెటా వంటి సోషల్ మీడియా సంస్థలతో పాటు డొమైన్ నేమ్ రిజిస్ట్రార్లను ప్రతివాదులుగా చేర్చారు. నటి తరఫు సీనియర్ అడ్వకేట్ వెంకటేష్ ధోండ్ వాదనలు వినిపిస్తూ.. రోజురోజుకూ ఈ డీప్‌ఫేక్స్ నాణ్యత పెరుగుతోందని, అందువల్ల తక్షణమే సదరు లింకులను తొలగించేలా ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. మరోవైపు గూగుల్, మెటా సంస్థల తరఫు న్యాయవాదులు స్పందిస్తూ.. వివాదాస్పద లింకులను తొలగించడానికి తమకు ఎటువంటి అభ్యంతరం లేదని, అయితే సాధారణ చట్టబద్ధమైన కంటెంట్‌ను ముందస్తుగా పర్యవేక్షించి బ్లాక్ చేయాలనే నిబంధనలు విధించవద్దని కోర్టును అభ్యర్థించారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి.. సాధారణ కంటెంట్‌కు ఇబ్బంది లేకుండా, కేవలం అభ్యంతరకర లింకులను మాత్రమే తొలగించేలా ఒక ప్రాక్టికల్ ప్రోటోకాల్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు.